తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 102 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 శుక్రవారం 13 - 11 - 2026 వెల రూ. 2 రూ/

22ఏ దరఖాస్తుల్లో ఒక్కటి కూడా

పెండింగ్‌లో ఉండొద్దు

- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం
- 22ఏ భూ సమస్యల పరిష్కారం మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు
- ఈ భూములకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు.
- 22ఏ భూములపై కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



హైదరాబాద్ :

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఏ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. ఆ దిశగా సర్కారు తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పిస్తున్నట్లు వివరించారు. 22ఏ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి చర్చించారు. 22ఏ సమస్యలకు - మిగతా 2 లో

తెలంగాణలో స్వచ్ఛ నగరంగా జీహెచ్ఎంసీ



- రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో హైదరాబాద్ ఉత్తమ స్వచ్ఛ నగరంగా ఎంపికైంది
- రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి అవార్డు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

హైదరాబాద్ :

తెలంగాణలో ఉత్తమ స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నిలిచింది. కేంద్ర పట్టణాభివృద్ధి - మిగతా 2 లో



తెలంగాణాలో 21 మంది

ఐపీఎస్‌ల బదిలీలు

- వీసీ సజ్జనార్‌కు కొత్త పోస్టు
- తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ
- హైదరాబాద్ నూతన సీపీగా మహేష్ భగవత్ నియామకం
- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్ బదిలీ
- లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్

హైదరాబాద్ :

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా - మిగతా 2 లో

దేశ విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- మీడియాకు ప్రధాని మోదీ పిలుపు
- దిల్లీలో జరిగిన దీపావళి మిలన్ కార్యక్రమంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు



ఢిల్లీ :

దేశ విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మీడియా మరింత కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. వివిధ రంగాల్లో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఇప్పటికే ఈ దిశగా చాలా పని జరుగుతోందని అన్నారు. భారత్ తప్పకుండా అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం భాజపా ప్రధాన కార్యాలయంలో పాత్రికేయుల కోసం నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావించారు.దేశంలో పేదరిక నిర్మూలన దిశగా తమ ప్రభుత్వం కీలక పురోగతి - మిగతా 2 లో



హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ

- జెన్‌పాక్ట్‌తో కీలక భాగస్వామ్యం
- హైదరాబాద్‌లో మార్స్ జీసీసీ కేంద్రం ప్రారంభం
- మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో సరికొత్త కేంద్రం ఏర్పాటు
- త్వరలోనే వెయ్యి మంది నిపుణుల స్థాయికి విస్తరణ
- ఏఐ క్లౌడ్ ఇంజనీరింగ్‌పై ప్రధాన దృష్టి

హైదరాబాద్ :

హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) ప్రధాన కేంద్రంగా ఎదుగుతున్న క్రమంలో మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఇక్కడ తన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రఖ్యాత సంస్థ 'మార్స్' (మిఠాయి), ఐటీ సేవల సంస్థ 'జెన్‌పాక్ట్' భాగస్వామ్యంతో - మిగతా 2 లో

శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయాలి



- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఆకస్మిక దాడులను తిప్పికొట్టేలా ఉండాలి
- శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయడంతో పాటు, ఆకస్మిక దాడులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని పెంపొందించు- కోవాలన్నారు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు

ఢిల్లీ :

ఆధునిక యుద్ధ తంత్రంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా త్రివిధ దళాలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయడంతో పాటు, ఆకస్మిక దాడులను తిప్పికొట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. దిల్లీలో జరిగిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు.ముప్పు ముంచుకు రాకముందే గుర్తించేలా నిఘా, - మిగతా 2 లో



ఖనిజాల వేటలో భారత్ దూకుడు

- కీలక ఖనిజాల కోసం 15 అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకున్న భారత్
- చైనా, కెనడా, ఈయూ కంటే వేగంగా భారత్ ముందడుగు
- అర్జెంటీనా, ఆస్ట్రేలియాలతో లిథియం తవ్వకాలకు భాగస్వామ్యం - మిగతా 2 లో

నీటిని తోడేస్తున్న ధనిక రైతులు.. రీచార్జ్ చేస్తున్న పేద రైతులు!

- రాయలసీమ భూగర్భ జలాలపై ఐఐఎస్సీ కీలక అధ్యయనం
- భూగర్భ జలాల వినియోగంపై ఐఐఎస్సీ పరిశోధన
- రాయలసీమలో శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి అధ్యయనం
- తోటల సాగుతో తరిగిపోతున్న భూగర్భ జలాలు
- వర్షాధార పంటలతోనే గ్రౌండ్ వాటర్ రీఛార్జ్

అమరావతి :

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) పరిధిలోని ఇండో-ఫ్రెంచ్ సెల్ ఫర్ వాటర్ సైన్సెస్ (ఐఎఫ్‌సీడబ్ల్యూఎస్) పరిశోధకులు భూగర్భ జలాల వినియోగంపై ఒక కీలక అధ్యయనాన్ని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో ధనిక రైతులు అత్యధికంగా భూగర్భ జలాలను తోడేస్తుండగా, పేద రైతుల వ్యవసాయ విధానాలే ఆ నీటిని తిరిగి భూమిలోకి రీఛార్జ్ చేస్తున్నాయని ఈ పరిశోధన స్పష్టం చేసింది. విధాన రూపకర్తలు తరచూ పేద రైతుల ఈ అమూల్యమైన

సాగర తీరాన పెట్టుబడుల పండుగ

- ప్రారంభమైన సీఐఐ సదస్సు
- సాగర తీరాన పెట్టుబడుల పండుగ మొదలైంది
- 12 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం
- సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ వచ్చారు
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ హాజరు
- ప్రపంచ దేశాల నుంచి తరలివచ్చిన పారిశ్రామిక ప్రతినిధులు
- రాష్ట్ర ప్రగతి, స్వర్ణాంధ్ర విజన్‌ను వివరించిన సీఎం
- అరకు కాఫీ రుచిని ఆస్వాదించిన ప్రముఖులు



విశాఖపట్నం :

విశాఖలో సీఐఐ పెట్టుబడుల సదస్సు ఘనంగా ప్రారంభమయ్యింది. కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీశాఖ మంత్రి లోకేశ్ సదస్సును ప్రారంభించారు. వివిధ దేశాల ప్రతినిధులు పెద్ద ఎత్తున సదస్సుకు హాజరయ్యారు.సాగర తీరాన పెట్టుబడుల పండుగ మొదలైంది. 12 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఎంఓయూలు చేసుకోనున్నారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ గోయల్‌కు స్వాగతం పలికారు. అనంతరం గోయల్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీశాఖ మంత్రి లోకేశ్ సదస్సు జరుగుతున్న ప్రాంగణమంతా కలియతిరిగారు. సదస్సులో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఏర్పాట్లను కేంద్ర మంత్రి గోయల్ మెచ్చుకున్నారు. పెట్టబడిదారులకు రాష్ట్రంలోని అనుకూలతలు, ఉన్న సౌకర్యాలను వివరించేలా ఆంధ్రప్రదేశ్ - మిగతా 2 లో

23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



- నవంబర్ 26న పోలింగ్.. 30న ఫలితాలు
- ఏపీలో 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన ఎస్ఈసీ
- రాష్ట్రంలో 23 చోట్ల పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిర్వహించాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

అమరావతి :

ఏపీలో పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజ్యు) నోటిఫికేషన్ విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఈనెల 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 13 - 11 - 2026

సంపాదకీయం

నీటి పొదుపు బాధ్యత సామాన్యుడికేనా?



తెలంగాణలో వర్షాలు తగ్గాయి. జలాశయాల్లో నిల్వలు క్షీణిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ సమయంలో ప్రభుత్వం, అధికారులు ప్రజలకు ఒకే సందేశం ఇస్తున్నారు, నీటిని పొదుపు చేయండి అని. అది సరైనదే. కానీ ఒక ప్రశ్న అడగాల్సిన సమయం వచ్చింది. నీటిని పొదుపు చేయాల్సింది కేవలం సామాన్యులేనా? ఈ సంవత్సరం జూన్ నుంచి అక్టోబర్ వరకు తెలంగాణలో సాధారణం కంటే వర్షపాతం గణనీయంగా తగ్గింది. జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయితో పోలిస్తే తగ్గాయి. హైదరాబాద్‌కు కీలకమైన సింగూరు జలాశయంలో పూర్తి సామర్థ్యంతో పోలిస్తే నిల్వలు అత్యల్ప స్థాయికి చేరాయి. తాగునీటికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో నీటిని పొదుపు చేయాలని ప్రజలను కోరుతూ, మరోవైపు భారీగా నీటిని వినియోగించే పరిశ్రమలకు ఎలాంటి ప్రమాణాలు లేకుండా అవకాశాలు కల్పిస్తే... అది సమగ్ర నీటి విధానం ఎలా అవుతుంది?బీరు తయారీలో నీరు ప్రధాన ముడిసరుకు మాత్రమే కాదు... శుభ్రపరిచే ప్రక్రియలు, శీతలీకరణ వంటి అనేక దశల్లో కూడా నీరు అవసరం. నీటి ఎద్దడి ప్రాంతాల్లో ఇటువంటి పరిశ్రమలు ఎంత నీటిని వినియోగిస్తున్నాయి? ఆ నీరు నదుల నుంచి వస్తోందా, భూగర్భ జలాల నుంచి వస్తోందా? వాటి వినియోగ వివరాలు ప్రజలకు ఎందుకు అందుబాటులో ఉండకూడదు? అలాగే హైదరాబాద్‌ను డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దడం ఆర్థికంగా అవసరమే. అయితే, కొన్ని సంప్రదాయ శీతలీకరణ పద్ధతులు గణనీయమైన నీటిని వినియోగిస్తాయి. వాటి నీటి అవసరాలపై ముందస్తు లెక్కలు, ప్రజా చర్చ జరగకూడదా?ఇక్కడ సమస్య పరిశ్రమలపై వ్యతిరేకత కాదు, నీటి వినియోగంలో పారదర్శకత. శుద్ధి చేసిన మురుగు నీటిని పరిశ్రమలు, డేటా సెంటర్లకు సరఫరా చేయడం వంటి ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం సరైన దిశ. నీటి రహిత లేదా తక్కువ నీటి శీతలీకరణ సాంకేతికతలను ప్రోత్సహించడం కూడా అవసరం. కానీ ఇవి కేవలం ప్రణాళికలుగా కాకుండా అనుమతులకు ముందస్తు షరతులుగా మారాలి. నీటి కరువు ప్రకృతి విపత్తు కావచ్చు. కానీ నీటి కొరతను తీవ్రం చేసే విధానపరమైన తప్పిదాలకు మనమే బాధ్యులం. అందుకే ఈ సంక్షోభంలో ఒకే సూత్రం ఉండాలి. పొదుపు సామాన్యుడి బాధ్యత మాత్రమే కాదు, ప్రభుత్వానిదీ పరిశ్రమలదీ కూడా.

సాగర తీరాన పెట్టుబడుల పండుగ

మొదటిపేజీ తరువాయి - మ్యాప్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.మ్యాప్‌ను గోయల్‌కు చూపించిన ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ జిల్లాల్లో ఇప్పటికే ఏర్పాటైన పరిశ్రమలు, గతంలో కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఎంతమేర గ్రౌండ్ అయ్యాయనే వివరాలను అంకెలతో సహా వివరించారు. అనంతరం ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ పెవిలియన్లను ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిటల్ స్క్రీన్లపై రాష్ట్రంలో పంటల సాగు, పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను కేంద్ర మంత్రికి మంత్రి లోకేశ్ వివరించారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రగతి, స్వర్ణాంధ్ర విజన్, సోలార్ విద్యుత్ ప్లాంట్ల అభివృద్ధి తదితర అంశాలను చంద్రబాబు మ్యాప్ ద్వారా వివరించారు.ఆ తర్వాత అంతర్జాతీయంగా ప్రాముఖ్యం పొందిన అరకు కాఫీని నేతలు ఆస్వాదించారు. అరకు కాఫీ టేస్ట్ అదరహో అని కేంద్రమంత్రి



పీయూష్ గోయల్ మెచ్చుకున్నారు. పక్కనే ఉన్న పవన్‌కల్యాణ్, లోకేశ్ కూడా అరకు కాఫీ తయారీ వివరాలను గోయల్‌కు వివరించారు. ఆ పక్కనే ఉన్న నేతన్నల కలంకారీ ప్రదర్శనను సందర్శించిన నేతలు కుంచె చేతపట్టి రంగులద్దారు. కళాకారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు థింసా, తప్పెటగుళ్లు, గరగ నృత్యాలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు అతిథులను ఆకట్టుకున్నాయి. కళాకారుల వద్దకు వెళ్లి వారితో ఫొటోలు దిగిన చంద్రబాబు, పవన్, పీయూష్ గోయల్ ఆ తర్వాత డోలు వాయించారు. అనంతరం ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులను కూడా అభినందించారు.విశాఖ సీఐఐ సదస్సు వేదికగా పెట్టుబడుల ఆకర్షణకు మంత్రి నారా లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు హాజరైన పవన్ కల్యాణ్‌తో మంత్రి లోకేశ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న సంస్థలు, ఇన్వెస్టర్ల వివరాలను పవన్‌కు వివరించారు. పెట్టుబడుల రాక కోసం లోకేశ్ చేస్తున్న చొరవను పవన్ కల్యాణ్ ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు.

23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

మొదటిపేజీ తరువాయి - పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారంతో 4 కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు కలిపి మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థల్లో రెండోదశ ఎన్నికలకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఏర్పాట్లు చేసింది.ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా మాట్లాడారు. రాష్ట్రంలో 23 చోట్ల పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిర్వహించాలని ఆయన సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ, పటిష్టమైన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అనిల్ చంద్ర పునేఠా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సుప్రీంకోర్టు జోక్యం, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను అధికారులు, పోలీసు యంత్రాంగం సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించిందని సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న పంచాయతీ ఎన్నికలు కూడా సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.“23 పట్టణ స్థానిక సంస్థల్లో మొత్తం 1,009 వార్డులు ఉన్నాయి. 23 పట్టణ స్థానిక సంస్థల్లో మొత్తం 24.98 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 1,009 వార్డుల్లో 503 వార్డులు మహిళలకు కేటాయించాం. 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు 2,801 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు 283 మంది రిటర్నింగ్ అధికారులను (ఆర్‌వోలు) నియమించాం. పంచాయతీ ఎన్నికల మొదటి దశకు రేపు నోటిఫికేషన్ విడుదల చేస్తాం” - అనిల్ చంద్ర పునేఠా, రాష్ట్ర ఎన్నికల కమిషనర్

ఎన్నికలు నిర్వహించనున్న స్థానిక సంస్థలివే :

నగరపాలక సంస్థలు: శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి-తాడేపల్లి



పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు: ఆమదాలవలస (శ్రీకాకుళం), రాజాం (విజయనగరం), పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు (పశ్చిమగోదావరి), చింతలపూడి (ఏలూరు), గుడివాడ, తాడిగడప (కృష్ణా), పొన్నూరు (గుంటూరు), నరసరావుపేట (పల్నాడు), కందుకూరు (ప్రకాశం), పొదిలి (మార్కాపురం), కావలి, గూడూరు, అల్లూరు (నెల్లూరు), శ్రీకాళహస్తి (తిరుపతి), బి.కొత్తకోట (అన్నమయ్య), బాపట్ల.

దేశ విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

మొదటిపేజీ తరువాయి -

సాధించిందని ప్రధాని మోదీ అన్నారు. గతంలో పేదరికాన్ని తొలగిస్తామంటూ నినాదాలు మాత్రమే వినిపించేవని, తమ ప్రభుత్వం పేదరికాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం, గత 12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరిక రేఖకు దిగువ నుంచి బయటకు వచ్చారని వెల్లడించారు. 'గరీబీ హటావో' అంటూ గతంలో నినాదాలు ఇచ్చేవారని, కానీ తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలన దిశగా పనిచేసిందని అన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా ఈ పురోగతి సాధ్యమైందని వివరించారు.మరోవైపు మీడియాతో తనకు చాలా కాలంగా అనుబంధం ఉందని మోదీ గుర్తుచేసుకున్నారు. పండుగ సమయంలో కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతారని, అయినప్పటికీ నిరంతరం బ్రేకింగ్ న్యూస్ కోసం పనిచేసే పాత్రికేయులు ఈ కార్యక్రమానికి సమయం కేటాయించడం అభినందనీయమని అన్నారు. పత్రికా ప్రకటనల కాలం నుంచి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వరకు మీడియా రంగంలో వచ్చిన మార్పులను తాను దగ్గరగా చూశానని పేర్కొన్నారు. అలాగే ఒకప్పుడు కార్యక్రమాల్లో కుర్చీలు సర్దడం, అతిథులను చూసుకోవడం వంటి పనులు చేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. 1990లో దేశవ్యాప్తంగా రెండు ప్రధాన యాత్రల బాధ్యతలను తనకు అప్పగించారని మోదీ తెలిపారు. అప్పట్లో ఒక పత్రికా ప్రకటన పంపాలన్నా ఫ్యాక్స్ మెషీన్ కోసం వెతకాల్సి వచ్చేదని అన్నారు. దిల్లీకి మారిన తర్వాత కూడా ఆ బాధ్యతలు కొనసాగాయని చెప్పారు.అంతే కాకుండా ఆ రోజుల్లో జరిగే దీపావళి మిలన్ కార్యక్రమాల్లో కుర్చీలు సర్దడం, అతిథులకు ఏర్పాట్లు చేయడం తన పని అని మోదీ వివరించారు. అప్పట్లో కెమెరాలు తక్కువగా ఉన్నప్పటికీ మీడియా ప్రతినిధులతో తన అనుబంధం బలంగా ఉండేదన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా తన నియామకం గురించి పార్టీలోని చాలామం దికంటే ముందే మీడియాకు తెలిసిందని మోదీ వెల్లడించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నట్లు తెలుసుకున్న పాత్రికేయుల బృందం ఒకసారి తన గదికి వచ్చి స్వీట్లు ఇవ్వాలని అడిగిందని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో మహిళా పాత్రికేయుల బృందం తన వద్దకు వచ్చి, 'మీరు గుజరాత్‌కు వెళ్తున్నారు, ముఖ్యమంత్రి కాబోతున్నారు. మాకు స్వీట్లు ఇవ్వండి' అని అడిగినట్లు చెప్పారు. మీడియాతో తనకున్న అనుబంధం నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, అప్పటి అనుభవాలు ఇప్పటికీ ఉపయో గపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధిపతిగా తనకు 25 ఏళు ్లపూర్తయ్యాయని కూడా గుర్తుచేశారు.ఇదిలా ఉండగా, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా దేశంలో జరుగుతున్న పోరాటంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని ప్రధాని మీడియాను కోరారు. ఈ సమస్య వల్ల కలిగే నష్టాలు, దాని నివారణకు జరుగుతున్న ప్రయత్నాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకు ఈ అంశంపై అవగాహన కల్పించడంలో మీడియా సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం సాధిస్తున్న విజయాలను, వివిధ రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు తెలియ జేయడంలో మీడియా పాత్ర కీలకమని మోదీ అన్నారు. కేవలం సమస్యలు, సంక్షోభాలపైనే కాకుండా దేశ ప్రగతిని చాటిచెప్పే అంశాలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. దేశ విజయగాథలపై కథనాలు రూపొందించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ తరహా కథనాలు అనేకం వస్తున్నాయని, ఈ ప్రయత్నాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

నీటిని తోడేస్తున్న ధనిక రైతులు.. రీచార్జ్ చేస్తున్న పేద రైతులు!

మొదటిపేజీ తరువాయి - దీనిని దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణ విధానాలను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతానికి చెందిన ఒక గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుని పరిశోధకులు 'బ్లూ వాటర్ పొటెన్షియల్' (బీడబ్ల్యూపీ) అనే సరికొత్త కొలమానాన్ని రూపొందించారు. ఇది సహజ సిద్ధంగా భూగర్భంలోకి చేరే నీటికి, పంటల సాగు కోసం అవసరమయ్యే నీటి వినియోగానికి మధ్య ఉన్న నికర తేడాను లెక్కిస్తుంది. ఈ విశ్లేషణలో రాయలసీమ నేలపై తీవ్రమైన అసమానతలు బయటపడ్డాయి. దానిమ్మ, బత్తాయి, ద్రాక్ష వంటి దీర్ఘకాలిక ఉద్యాన తోటలను సాగు చేసే సంపన్న రైతుల భూముల్లో బీడబ్ల్యూపీ తీవ్రమైన లోటును ప్రదర్శిస్తోంది. అంటే, ఈ తోటలు తిరిగి భూమిలోకి చేర్చే నీటి కంటే ఏడాదికి దాదాపు 1000 నుంచి 1200 మిల్లీమీటర్ల మేర అదనపు నీటిని తోడేస్తున్నాయి. మరోవైపు, పేద రైతులు సాగు చేసే వర్షాధార వేరుశనగ పంటలు, పచ్చిక బయళ్లు ఏడాదికి 200 నుంచి 300 మిల్లీమీటర్ల నీటిని భూగర్భంలోకి చేర్చుతూ సానుకూల బీడబ్ల్యూపీని నమోదు చేస్తున్నాయి.గ్రామ స్థాయిలో చూస్తే కేవలం 26 శాతం మంది సంపన్న రైతులు ఉద్యాన పంటల కోసం అత్యధిక శాతం భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని నివేదిక స్పష్టం చేసింది. అయితే, పరోక్షంగా ఈ ధనిక రైతుల తోటల మనుగడ పేద రైతులు కాపాడుతున్న రీఛార్జ్ వనరులపైనే ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమను రూ. 1 లక్ష కోట్లతో 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ద వరల్డ్'గా మార్చేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.అయితే, నెగెటివ్ బీడబ్ల్యూపీ ఉన్న ఉద్యాన తోటల విస్తీర్ణం పెరిగితే భూగర్భ జలాలు మరింత పాతాళానికి పడిపోయే ప్రమాదం ఉందని పరిశోధకురాలు షార్లెట్ హెమింగ్‌వే హెచ్చరించారు. భవిష్యత్ పంటల అవసరాలు, వాతావరణ మార్పులను తట్టుకోవడానికి కాలువల ద్వారా నీటిని సమర్థంగా తీసుకురావాల్సిన అవసరం ఉందని ఐఐఎస్సీ ప్రొఫెసర్ ఎం. శేఖర్ పేర్కొన్నారు. పాలసీల రూపకల్పనకు సహాయపడేలా ఐఐఎస్సీ పూర్వ విద్యార్థిని రుతుజా చిత్ర-తారక్ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.

శత్రువుకు కోలుకునే సమయం ఇవ్వకుండా దెబ్బతీయాలి

మొదటిపేజీ తరువాయి - పర్యవేక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేయాలని, శత్రువు ప్రతిస్పందించేలోపే విరుచుకుపడే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. నేటి కాలంలో యుద్ధాలు కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా ఎలక్ట్రానిక్, సైబర్, అంతరిక్ష రంగాలకు విస్తరించాయని వివరించారు. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, గగనతల రక్షణ వ్యవస్థలు అత్యంత కీలకంగా మారాయని చెప్పారు. కామికాజీ డ్రోన్లు, కౌంటర్-డ్రోన్ ఆపరేషన్ల కోసం ప్రత్యేక విధానాలను రూపొందించాలన్నారు. త్రివిధ దళాల మధ్య సమన్వయం, సంయుక్త కార్యాచరణ భవిష్యత్ సైనిక ప్రణాళికలకు మార్గదర్శకంగా నిలవాలని రాజనాథ్ సింగ్ పిలుపునిచ్చారు.

22ఏ దరఖాస్తుల్లో ఒక్కటి కూడా పెండింగ్‌లో ఉండొద్దు

మొదటిపేజీ తరువాయి - శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా కీలక చర్యలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు. జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు జారీచేసినట్లు తెలిపారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ,



హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఈ మేరకు ఇప్పటిదాకా వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి స్పష్టం చేశారు.22ఏ భూ సమస్యల పరిష్కారంపై ప్రతివారం జిల్లా స్థాయి అధికారులు సమీక్షించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఒకవేళ జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని దరఖాస్తులను ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలన్నారు. అలాగే అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూములకు సంబంధించి వివిధ కోర్టుల తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్ల దాఖలుతోపాటు ఇతర అంశాలపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

తెలంగాణలో స్వచ్ఛ నగరంగా నిలిచిన జీహెచ్ఎంసీ

మొదటిపేజీ తరువాయి - శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో హైదరాబాద్‌కు దక్కిన ఈ అవార్డును బుధవారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీకర్ణన్‌లు అందుకున్నారు.జాతీయ స్థాయిలో మెంటార్-మెంటీ సిటీస్, స్వచ్ఛ నగరాల లీగ్, 10 లక్షలకు పైగా, 3 నుంచి 10 లక్షలు, 50 వేల నుంచి 3 లక్షలు, 20 వేల నుంచి 50 వేలు, 20 వేలలోపు జనాభా, నదీ, సముద్ర తీరం, హిమాలయ ప్రాంత నగరాల కేటగిరీల్లో తొలి 3 స్థానాల్లో నిలిచిన పట్టణ స్థానిక సంస్థలకు భారత రాష్ట్రపతి ముర్ము అవార్డులు ప్రదానం చేశారు. అర్హత ఉన్న విభాగాల్లో ఏ కేటగిరీలోనూ తెలంగాణ తొలి మూడు స్థానాలను దక్కించుకోలేకపోయింది.రాష్ట్ర స్థాయి ఉత్తమ నగరాల్లో మాత్రం తెలంగాణలో గ్రేటర్ హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచింది. పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి శుద్ధి, ఇళ్ల నుంచి చెత్త సేకరణ, నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం వంటి 10 ప్రధాన అంశాల ఆధారంగా చేపట్టిన మూల్యాంకనంలో జీహెచ్ఎంసీ మెరుగైన ఫలితాలను సాధించింది. పారిశుద్ధ్యం విషయంలో చేర్యాల, మంథని మున్సిపాలిటీలకు మెంటార్‌గా వ్యవహరించి వాటి పనితీరును మెరుగుపరిచింది.ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడారు. నగరాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దే విషయంలో ప్రజల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తన ప్రజా జీవిత ప్రస్థానం పంచాయతీలో స్వచ్ఛతా కార్యక్రమం ద్వారానే ప్రారంభమైందన్న ముర్ము, ఈ రంగంలో అందరూ గుర్తించదగ్గ మార్పు తీసుకురావాలంటే అధికార వ్యవస్థ ప్రజలతో కలిసి పని చేయాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల క్షేత్రస్థాయి అనుభవాలనూ పరిగణనలోకి తీసుకొని, వాటిని ఆచరణలో పెట్టాలని స్పష్టం చేశారు.స్వచ్ఛ భారత్ మిషన్ ఫలితాలు మరింత వేగంగా అందుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వాలూ ఇదే విధంగా రాష్ట్రస్థాయిలో సర్వే నిర్వహించి మంచి పనితీరు కనబరిచిన మున్సిపాలిటీలకు అవార్డులు అందజేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ సూచించారు.

హైదరాబాద్ వేదికగా మార్స్ జీసీసీ విస్తరణ

మొదటిపేజీ తరువాయి - ఏర్పాటు చేసిన సరికొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను గురువారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అధికారికంగా ప్రారంభించారు.ఈ సరికొత్త కేంద్రం ప్రస్తుతం 60,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. ప్రారంభ దశలో భాగంగా 400 నుంచి 525 మంది జెన్‌పాక్ట్ ఉద్యోగులతో కార్యకలాపాలు సాగనున్నా యి. భవిష్యత్తులో ఈ కేంద్రాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. రాబోయే కాలంలో మరో 70,000 చదరపు అడుగుల స్థలాన్ని జోడించి, ఉద్యోగుల సంఖ్యను దాదాపు 1,000 మంది మార్స్ అసోసియేట్స్ స్థాయికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కేంద్రం ప్రధానంగా అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), సాఫ్ట్‌వేర్ అండ్ క్లౌడ్ ఇంజనీరింగ్, ఆటోమేషన్, డేటా అండ్ అనలిటిక్స్ వంటి కీలక టెక్నాలజీ విభాగాల్లో హైదరాబాద్ కేంద్రం నుంచి గ్లోబల్ సేవలు అందనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలను అందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించనుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్నికర్స్, ఎం అండ్ ఎమ్స్, పెడిగ్రీ, రాయల్ కెనైన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రజలకు సుపరిచితమని పేర్కొన్నారు. అంతటి గుర్తింపు ఉన్న సంస్థ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణలో ఉన్న అనుకూల పారిశ్రామిక వాతావరణం, ప్రతిభావంతులైన మానవ వనరులు ఐటీ రంగ విస్తరణకు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మార్స్ మరియు జెన్‌పాక్ట్ బృందాలకు ఆయన అభినందనలు తెలియజేశారు.

తెలంగాణాలో 21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి - 21 మంది సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో సమూల మార్పులు చేస్తూ పోస్టింగ్‌లు కేటాయించారు.ఈ బదిలీల్లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు కొత్త సారథి వచ్చారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ సీపీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా (డీజీ) బదిలీ చేశారు. ఆయనకు అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు.అలాగే రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్ నియమితులయ్యారు. ఆయనకు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలను కూడా ప్రభుత్వం కేటాయించింది.ం

ఖనిజాల వేటలో భారత్ దూకుడు

మొదటిపేజీ తరువాయి - ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ రంగం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్ అవసరాలకు కీలకమైన ఖనిజాల సేకరణలో భారత్ అత్యంత చురుగ్గా వ్యవహరిస్తోంది. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు భారత్ మొత్తం 15 క్రిటికల్ మినరల్స్ ఒప్పందాలపై సంతకాలు చేసి గ్లోబల్ రేసులో అగ్రగామిగా నిలిచింది. క్లైమేట్ యాక్షన్ ట్రైవ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, అంతర్జాతీయంగా కీలక ఖనిజ వనరులను చేజిక్కించుకోవడంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానాన్ని దక్కించుకుంది.ఈ జాబితాలో 41 ఒప్పందాలతో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత స్థానాన్ని భారత్ కైవసం చేసుకుంది. 11 ఒప్పందాలు మాత్రమే చేసుకున్న చైనా, కెనడా, సౌదీ అరేబియా, యూరోపియన్ యూనియన్ వంటి ప్రధాన దేశాలను భారత్ వెనక్కి నెట్టింది.ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక బ్యాటరీలు, విండ్ టర్బైన్లు, విద్యుత్ గ్రిడ్లు, సెమీకండక్టర్ల తయారీకి లిథియం, కోబాల్ట్, నికెల

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలి

పెద్దవడుగూరు ఎస్సై రాఘవేంద్రప్ప

తైక్వాండో జోనల్ పోటీల్లో ఆదర్శ విద్యా నికేతన్ విద్యార్థుల జయకేతనం



పెద్దవడుగూరు (తెలుగు కలం) (నవంబర్ 12) : విద్యార్థులు ఆధునిక సాంకేతికత పేరిట సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా, చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పెద్దవడుగూరు ఎస్సై రాఘవేంద్రప్ప పిలుపునిచ్చారు. రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన స్థానిక ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థుల అభినందన సభ గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై రాఘవేంద్రప్ప విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి రోజువారీ జీవితంలో వ్యాయామం, క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. తద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడతాయని తెలిపారు. ముఖ్యంగా తైక్వాండో వంటి యుద్ధకళలు బాలబాలికలకు ఆత్మరక్షణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జోనల్ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. రాయలసీమ జోనల్ స్థాయి పోటీల్లో ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పతకాల పంట పండించారు. వీరిలో కరణం సహస్ర ప్రగ్య, యు. హర్షిత సాయి రెడ్డి బంగారు పతకాలను కైవసం చేసుకోగా, బండారు రాకేష్, చాకలి పవన్ కుమార్ రజత పతకాలు సాధించారు. అలాగే షేక్ చాంద్ బాషా, కరణం అనిరుద్, బి. చక్రధర్ రెడ్డి కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన తైక్వాండో మాస్టర్ తలారి తులసిరామ్‌ను, విజేతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ కరణం నారాయణరావు, వైస్ ప్రిన్సిపల్ కరణం మాధుర్యలహరి, ఉపాధ్యాయ బృందం ముఖ్య అతిథి ఎస్సై రాఘవేంద్రప్పను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె. పరమేశ్వర్, జె. దీప్తి, బి. ఆదిలక్ష్మి, ఎన్. వసుంధరదేవి, ఎ. మమత, డి. దస్తగిరమ్మ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

ఖాతాదారులకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి

జనరల్ మేనేజర్ పి. శ్రీదేవి



పెద్దవడుగూరు (తెలుగు కలం) (నవంబర్ 12) : గ్రామీణ ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకింగ్ వ్యవస్థ ఎంతో కీలకమని, మారుమూల గ్రామాల ప్రజలకు సైతం ఆర్థిక సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ముందుకు సాగుతోందని బ్యాంక్ జనరల్ మేనేజర్ పి. శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం పెద్దవడుగూరు మండలంలోని క్రిష్ణిపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ 1368వ నూతన శాఖను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జనరల్ మేనేజర్ పి. శ్రీదేవి మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలు చిన్నపాటి బ్యాంకింగ్ అవసరాల కోసం కూడా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తొలగించి, స్థానికంగానే అన్ని సేవలను అందించేందుకు ఈ శాఖను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల్లో పొదుపు అలవాటును పెంపొందించడంతో పాటు, వారి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రుణ సౌకర్యాలు కల్పించడం తమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. రైతులు, చిరు వ్యాపారులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు బ్యాంకు సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం ప్రాంతీయ మేనేజర్ ఎం. రవిమోహన్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పొదుపు ఖాతాలు, వివిధ రకాల డిపాజిట్లు, ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో కూడిన రుణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఖాతాదారులు తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా బ్యాంకు ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, బ్యాంకు నుంచి రుణాలు పొందిన ప్రతి ఒక్కరూ వాటిని నిర్దేశిత గడువులోగా సక్రమంగా తిరిగి చెల్లించడం ద్వారా బ్యాంకు మరింత అభివృద్ధి చెందడానికి సహకరించాలని కోరారు. బ్రాంచ్ మేనేజర్ సి. జయకృష్ణ మాట్లాడుతూ, క్రిష్ణిపాడు గ్రామంలో నూతన శాఖ ప్రారంభం కావడం స్థానిక ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా మారనుందని తెలిపారు. ఖాతాదారులకు పారదర్శకమైన, నాణ్యమైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రతి ఖాతాదారుడికి స్నేహపూర్వక సేవలు అందిస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామస్తులందరూ బ్యాంకుతో సత్సంబంధాలు ఏర్పరచుకుని అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్రిష్ణిపాడు గ్రామంలో నూతన బ్యాంకు శాఖ ఏర్పాటు కావడంతో ఖాతాలు ప్రారంభించడం, పొదుపు చేయడం, రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడం వంటి సేవలు గ్రామస్తులకు స్థానికంగానే అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ప్రజల విలువైన సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం లభించనుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్యాషియర్ నవ్య తేజ, భవన యజమాని శ్రీకాంత్, వెలుగు అధికారి, సీసీ సుధాకర్, ఇతర బ్యాంకు సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన శాఖ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విధి వక్రించింది.. ఆసుపత్రికి వెళ్తుండగా మృత్యువు కాటేసింది!

రెండు కార్లు ఎదురెదురుగా ఢీ.. తండ్రి సహా ఇద్దరు దుర్మరణం

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పాముకాటుకు గురైన కుమారుడూ మృతి

డి.హీరేహాల్ మండలంలో పెను విషాదం





డి.హీరేహాల్ (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి పాముకాటుకు గురైన కన్నకొడుకును బతికించుకోవాలని ఆ తండ్రి చేసిన ఆరాటం తీరని విషాదంగా మిగిలింది. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. రాయదుర్గం--బళ్లారి ప్రధాన రహదారిలోని పులకుర్తి గేట్ సమీపంలో పెద్ద వంక వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న దుర్ఘటనలో తండ్రి సహా మరొకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కుమారుడు సైతం మృతిచెందాడు.పోలీసుల కథనం ప్రకారం.. డి.హీరేహాల్ మండలం సంజీవరాయనకోట గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి పాముకాటుకు గురయ్యాడు. అపమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కారులో బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పులకుర్తి గేట్ సమీపంలోని పెద్ద వంక వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న మరో కారు వీరి కారును బలంగా ఢీకొట్టింది.?ఈ ప్రమాద ధాటికి మల్లికార్జునరెడ్డితో పాటు బోయ చందు అనే వ్యక్తి ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. కారులో ఉన్న మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను హుటాహుటిన బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే పాముకాటు విషం శరీరమంతా వ్యాపించడం, ప్రమాద గాయాలు తోడవడంతో బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పవన్‌కుమార్‌రెడ్డి కూడా కన్నుమూశాడు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు గంటల వ్యవధిలోనే మృత్యువాత పడటంతో సంజీవరాయనకోట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డి.హీరేహాల్ ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి వెల్లడించారు.

జనాభా గణన ప్రక్రియ బాధ్యతాయుతంగా చేపట్టాలి డీఆర్ఓ ఏ. మలోల



అనంతపురం(తెలుగు కలం) (నవంబర్ 12) : భారతదేశ జనాభా గణన - 2027 కార్యక్రమంలో భాగంగా జనాభా గణన ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) ఏ. మలోల స్పష్టం చేశారు. గురువారం అనంతపురం నగరంలోని జేఎన్టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం మీటింగ్ హాలులో భారతదేశ జనాభా గణన - 2027 కింద ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, నేటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు సెన్సెస్ యాక్ట్, జనాభా డెమోగ్రాఫిక్ లక్షణాలు, కుటుంబ సభ్యులు, యజమాని పేరు, బంధుత్వం, సామాజిక లక్షణాలు, వృత్తి, అక్షరాస్యత, పని, శారీరక మరియు మానసిక వైకల్యాలు, వలసలు, జాతీయత తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందిస్తున్నారని పేర్కొన్నారు. రేపు మరియు ఎల్లుండి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు జేఎన్టీయూలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభం కానున్న జనాభా గణనకు ముమ్మర సన్నాహాలు జరుగుతున్నాయని డీఆర్ఓ తెలిపారు. పెద్దలు, చిన్న పిల్లలు అనే తేడా లేకుండా దేశంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను ఈ సర్వేలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో మాస్టర్ ట్రైనీలు, అధికారులకు శిక్షణ పూర్తయిందని, త్వరలోనే మండల, మున్సిపల్ స్థాయిలో ఎన్యుమరేటర్లు మరియు సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), పేదరిక నిర్మూలన పథకాల అమలుకు ఈ డేటా అత్యంత కీలకమని, అందువల్ల సిబ్బంది శిక్షణలో సందేహాలను నివృత్తి చేసుకుని సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం సెన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ దివాకర్ బరిహాస మాట్లాడుతూ, 2027 జనాభా గణన ఒక అత్యంత ముఖ్యమైన జాతీయ ప్రక్రియ అని పేర్కొన్నారు. సేకరించే డేటా కచ్చితత్వం, విశ్వసనీయత అనేవి క్షేత్రస్థాయి సిబ్బందికి ఇచ్చే శిక్షణ నాణ్యతపైనే ఆధారపడి ఉంటాయన్నారు. శిక్షణ కేవలం ప్రశ్నలు చదివి వినిపించడంతో సరిపెట్టకుండా, ఇంటింటికీ తిరిగి గృహ యజమానులతో ఓపికగా మాట్లాడుతూ వివరాలు ఎలా రాబట్టాలో ప్రాక్టికల్‌గా నేర్పించాలని ట్రైనర్లకు సూచించారు. ముఖ్యంగా మొబైల్ యాప్ వినియోగం, యూజర్ ఐడీ మరియు పాస్‌వర్డ్ జనరేట్ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి మినహాయింపులు, దూప్లికేషన్లు లేకుండా ప్రతి ఇంటిని కవర్ చేయాలని, సేకరించిన సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ ఏసీ డీహారి, సెన్సెస్ స్టాటిస్టికల్ ఆఫీసర్ దీపక్ భరద్వాజ్, సీపీఓ బాలాజీ నాయక్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, సెన్సెస్ డీటీ మధుసూదన్ రావు, మాస్టర్ ట్రైనర్లు కిరణ్, జీఎల్ఎన్ ప్రసాద్ మరియు ఫీల్డ్ ట్రైనర్లు పాల్గొన్నారు.

పేదల పాలిట ఆపన్నహస్తం.. గుమ్మనూరు జయరాం

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేద కుటుంబాలకు కొండంత భరోసా

రెండేళ్లలో 1,200 మందికి రూ.7.39 కోట్ల ఆర్థిక సాయం

44 మందికి రూ.25.24 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

గుంతకల్లు, నవంబర్ 12 (తెలుగు కలం): పేదల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యంగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా సాయం అందేలా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను గుర్తిస్తూ అర్హులైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.



సాయాన్ని చేరవేయడంలో ఆయన చేస్తున్న కృషి ప్రశంసలు అందుకుంటోంది. గురువారం గుంతకల్లు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుంతకల్లు మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామితో కలిసి 41, 42, 43, 44వ విడతలకు సంబంధించిన 44 మంది లబ్ధిదారులకు రూ.25,24,020 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అనారోగ్యం రూపంలో ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తున్నారని తెలిపారు. పేదల కుటుంబాలకు పెద్దదిక్కుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిలుస్తోందని పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో గత రెండేళ్లలో సుమారు 1,200 మందికి రూ.7 కోట్లకు పైగా ఊరటనిచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుమ్మనూరు నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలుస్తున్న గుమ్మనూరు జయరాం నాయకత్వానికి తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించామని, రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల సభ్యులు, మహిళలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కష్టకాలంలో అండగా నిలిచిన నాయకత్వం

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆర్థిక సాయం అందడం తమ కుటుంబాలకు ఎంతో

స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ఎన్ఈసీ వీడియో కాన్ఫరెన్స్





అమరావతి / అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలు మరియు గ్రామ పంచాయతీల రెండవ సాధారణ ఎన్నికల సన్నద్ధతపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ (ఐఏఎస్ రిటైర్డ్) గురువారం సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జనరల్ అబ్జర్వర్లు, వ్యయ పరిశీలకులు, డీపీఓలు మరియు పట్టణ స్థానిక సంస్థల కమిషనర్లు పాల్గొన్నారు. ఈ క్రమంలో అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, సన్నద్ధత వివరాలను ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.

ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని ఘనంగా సన్మానించిన నెరనికి, నెరనికి తాండ, కొత్తపేట ఎంపీటీసీ ప్రతినిధులు



ఆలూరు (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : కర్నూలు జిల్లా హొళగుంద మండలం నెరనికి, నెరనికి తాండ, కొత్తపేట గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు శ్రీమతి నాగవేణి భర్త శ్రీ మల్లేష్ ఆలూరు పట్టణంలో నియోజకవర్గ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, అభినందనలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ పార్టీ శ్రేణుల పోరాట పటిమను కొనియాడారు. పార్టీ కేడర్ అంతా కసితో, గట్టిగా పోరాటం చేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ అక్రమాలను ప్రజలంతా నిశితంగా గమనించారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ అరాచకాలు, అన్యాయాలు చోటుచేసుకున్నప్పటికీ, 2024 ఎన్నికలతో పోలిస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగి ఉంటే వైయస్సార్‌సీపీకి అనుకూలంగా ఇంకా భారీ స్థాయిలో ఓటింగ్ శాతం నమోదయ్యేదని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ఈ వాస్తవం బయటకు వస్తే తమ ప్రభుత్వం చిక్కుల్లో పడుతుందనే భయంతోనే చంద్రబాబు అరాచకాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. ఎన్నికల అక్రమాల్లో చంద్రబాబు సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారని, వీటన్నింటినీ తట్టుకుని వైయస్సార్‌సీపీ విజయాలు సాధించిన చోట కూడా అక్రమాలకు పాల్పడి ఫలితాలను తారుమారు చేశారని విరుపాక్షి విమర్శించారు. గత వైయస్సార్‌సీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ అబద్ధపు నిందలు మోపుతూ, ప్రస్తుత ఎన్నికల్లో తాము చేసిన అరాచకాలను సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇన్ని దుర్మార్గాలకు పాల్పడి, ఇప్పుడు ప్రజాస్వామ్యం పేరిట నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో హొళగుంద మండల వైయస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, నెరనికి, నెరనికి తాండ, కొత్తపేట గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల సొత్తుపై కన్నేసిన దొంగ అరెస్ట్...!

ఒకే నిందితుడి నుంచి రూ.16.55 లక్షల విలువైన వస్తువుల స్వాధీనం

గుంతకల్లు, గుత్తి, ఆదోని పరిధిలో ఐదు చోరీ కేసులకు తెర



గుంతకల్లు నవంబర్ 12 తెలుగు కలం :- రైలు ప్రయాణాల్లో ప్రయాణికుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని విలువైన వస్తువులను దొంగిలిస్తున్న నిందితుడిని గుంతకల్లు రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా భాల్కి తాలూకా బలూర్ గ్రామానికి చెందిన సంగమేశ్ (28) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి సుమారు రూ.16.55 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుతో గుంతకల్లు, గుత్తి, ఆదోని రైల్వే పోలీస్ స్టేషన్లలో నమోదైన ఐదు చోరీ కేసులు కొలిక్కి వచ్చాయి.రైళ్లలో ప్రయాణించే సమయంలో ప్రయాణికులు నిద్రలోకి జారుకున్నాక వారి వద్ద ఉన్న విలువైన వస్తువులను అపహరించడమే నిందితుడి లక్ష్యంగా పోలీసులు గుర్తించారు. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా నిందితుడిని పట్టుకుని అతడి నుంచి 88 గ్రాముల బంగారు గొలుసు, లెనోవో ల్యాప్‌టాప్, ఛార్జర్, బ్యాగ్, ఆపిల్ ఐఫోన్ 16, రెండు ఒప్పో సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పరిధిలో వరుసగా చోటుచేసుకున్న ఐదు చోరీ కేసుల్లో నిందితుడి ప్రమేయాన్ని గుర్తించి కేసులను ఛేదించారు.ఈ వివరాలను గుంతకల్లు జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే జీఆర్పీ సీఐ కె.అజయ్ కుమార్ వెల్లడించారు. ప్రయాణికులు రైళ్లలో నిద్రించే సమయంలో తమ వస్తువులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను నిర్లక్ష్యంగా ఉంచరాదని సూచించారు.రైల్వే డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో సీఐ కె.అజయ్ కుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం సమన్వయంతో పనిచేసి ఈ కేసులను ఛేదించింది. ఈ ఆపరేషన్‌లో ఏఎస్ఐ సి.శ్రీనివాసులు, ఆర్పీఎస్ఐ కె.ఎం.వి.ప్రేమ్ కుమార్, ఆర్పీహెచ్‌సీ సి.శివరామయ్య, ఏఆర్‌హెచ్‌సీ వై.తిమ్మప్ప, పీసీ సి.ప్రవీణ్, ఆర్పీసీలు పి.హుస్సేన్ సాబ్, ఎస్.కె.మహమ్మద్ అలీ, సి.అమోస్ పాల్, ఎన్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఐదు కేసులను ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

మండల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా చిన్నవడుగూరు దివాకర్ రెడ్డి

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వ్యూహాత్మక అడుగులు



పెద్దవడుగూరు (తెలుగు కలం) (నవంబర్ 12) : తాడిపత్రి నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరు మండల రాజకీయాల్లో ఇప్పుడు చిన్నవడుగూరు గ్రామానికి చెందిన నాయకుడు దివాకర్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమరంలో ఆయన వ్యవహరించిన తీరు, క్షేత్రస్థాయిలో అభ్యర్థుల గెలుపు కోసం చేసిన కృషి స్థానిక రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి దిశానిర్దేశంలో పార్టీ జెండాను రెపరెపలాడించేందుకు దివాకర్ రెడ్డి విస్తృతంగా శ్రమించారు. ?ఎన్నికల నగారా మోగిన నాటి నుంచి ప్రచార గడువు ముగిసే వరకు ఆయన మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్సాహపరిచారు. కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా, ఆయా గ్రామాల్లోని స్థానిక సమీకరణాలను అంచనా వేస్తూ అభ్యర్థులకు అవసరమైన వ్యూహాత్మక సహకారాన్ని అందించారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని నమ్మే ఆయన, ఎన్నికల ప్రక్రియ ఆద్యంతం వారికి నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా నిలిచారు. జేసీ కుటుంబ ఆశయాలకు, పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తూ ఓటర్లను నేరుగా కలుసుకుని ప్రచారాన్ని పరుగులు పెట్టించారు. ?ప్రస్తుతం నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, అశ్మిత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలు జోరుగా సాగుతున్న తరుణంలో, దివాకర్ రెడ్డి వంటి మండల స్థాయి నాయకుల చురుకుదనం పార్టీకి అదనపు బలాన్ని చేకూరుస్తోంది. ఎన్నికలు ముగిసినా మండలంలో రాజకీయ వాతావరణం ఇంకా వేడిగానే ఉండటంతో, రాబోయే రోజుల్లో జేసీ ద్వయం అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు పార్టీ బలోపేతానికి దివాకర్ రెడ్డి ఎలాంటి కార్యాచరణతో ముందుకు సాగుతారన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

పోషణ్ ట్రాకర్ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్

నంబర్ 1515 వినియోగించుకోండి

ఐసీడీఎస్ పీడీ కటారి ప్రమీల పిలుపు



శ్రీ సత్యసాయి (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహార సేవలపై ఏవైనా సమస్యలు, సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే తక్షణమే జాతీయ పోషణ్ ట్రాకర్ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1515కు కాల్ చేసి తెలియజేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) కటారి ప్రమీల సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత పారదర్శకంగా మార్చడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడటమే ఈ హెల్ప్‌లైన్ ప్రధాన ఉద్దేశమని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ?జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు మరియు ఆరేళ్ల లోపు చిన్నపిల్లలకు ప్రతిరోజూ అందించే పౌష్టికాహారం, బాలామృతం, కోడిగుడ్లు, పాలు తదితర సరుకుల పంపిణీలో ఎక్కడైనా లోపాలు తలెత్తినా లేదా సకాలంలో అందకపోయినా లబ్ధిదారులు నేరుగా ఈ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని పీడీ వివరించారు. అలాగే, పోషణ్ ట్రాకర్ యాప్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు, రిజిస్ట్రేషన్ ఇబ్బందులు, ఇతర సేవల లోపాలపై కూడా 1515 నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ?కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మిషన్ సాక్షమ్ అంగన్‌వాడీ మరియు పోషణ్ 2.0' కార్యక్రమంలో భాగంగా ఈ 1515 ప్రత్యేక హెల్ప్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ నంబర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఉన్నతాధికారులు పర్యవేక్షించి, తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని కటారి ప్రమీల స్పష్టం చేశారు. కావున, జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కదిరి మండలంలో రేపటి నుండి

'ధరణి' నాణ్యమైన బియ్యం విక్రయాలు ప్రారంభం



కదిరి తెలుగుకలం నవంబర్ 12 : కదిరి మండల ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ధరణి రైస్' విక్రయాలు రేపటి నుండి (13.11.2026) ప్రారంభం కానున్నాయి. కదిరి పట్టణంలోని రాయచోటి రోడ్డులో ఉట్టి సమీపంలో ఉన్న ఒక కాంప్లెక్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైస్ కౌంటర్ (పబ్లిక్ రైస్ బజార్) ద్వారా ఈ బియ్యం అమ్మకాలను నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కౌంటర్ ద్వారా వినియోగదారులకు కేఎన్ఎమ్ / ఆర్ఎన్ఆర్ రకం బియ్యం కిలో రూ.50/- చొప్పున, అలాగే బీపీటీ రకం బియ్యం కిలో రూ.49/- చొప్పున అందుబాటులో ఉంటాయి. ప్రజల సౌకర్యార్థం ఈ నాణ్యమైన బియ్యం 26 కిలోల ప్యాకెట్ల రూపంలో కూడా విక్రయించబడతాయి. విక్రయాల ప్రారంభానికి ముందుగా, గురువారం (12.11.2026) శ్రీ సత్యసాయి జిల్లా పౌర సరఫరాల అధికారి కదిరిలోని ఈ ప్రత్యేక రైస్ కౌంటర్‌ను సందర్శించారు. కౌంటర్‌లో సిద్ధం చేసిన బియ్యం నిల్వలను, నాణ్యతా ప్రమాణాలను మరియు విక్రయాల ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచి, రేపటి నుండి విక్రయాలను సజావుగా ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కదిరి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ కూడా పాల్గొన్నారు. కావున, కదిరి మండల ప్రజలందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రత్యేక రైస్ కౌంటర్ ద్వారా నాణ్యమైన ధరణి బియ్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులు ఒక ప్రకటనలో కోరారు.

ప్రశాంత వాతావరణంలో సర్పంచ్

ఎన్నికల నిర్వహణే మా లక్ష్యం సీఐ ధరణి కిషోర్



గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : గుత్తి మండల పరిధిలోని అబ్బేదొడ్డి గ్రామంలో రాబోయే గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గుత్తి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ధరణి కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామ పర్యటన నిర్వహించి, గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈనెల 29వ తేదీన జరగనున్న గ్రామ సర్పంచ్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలకు తావులేకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఈ సందర్భంగా గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీసు సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ?ఈ గ్రామసభలో కేవలం ఎన్నికల ప్రశాంతత గురించే కాకుండా, గ్రామీణ ప్రాంత ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చే పలు కీలక అంశాలపై కూడా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఎమర్జెన్సీ సమయాల్లో లేదా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీసు సహాయం పొందేందుకు 'డైల్ 100' సేవలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో ప్రజలకు తెలియజేశారు. అంతేకాకుండా, సమాజంలో చిన్నారుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పోక్సో చట్టం' యొక్క తీవ్రతను, అలాగే బలహీన వర్గాల రక్షణార్థం అమలవుతున్న 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం' యొక్క ముఖ్యమైన నిబంధనలను గ్రామస్తులకు విశదీకరించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు యువకులు, గ్రామ పెద్దలు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ధరణి కిషోర్ తో పాటు స్థానిక పోలీసు సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శింగనమల సర్పంచ్ అభ్యర్థి ఎంపికపై నేడు టీడీపీ కీలక సమావేశం



శింగనమల (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమయ్యే క్రమంలో శింగనమల గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎంపిక విషయమై తెలుగుదేశం పార్టీ కీలక సమావేశం నిర్వహించనుంది. నియోజకవర్గ శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు, శుక్రవారం ఉదయం 10:00 గంటలకు స్థానిక శ్రీ ఆత్మారామస్వామి దేవాలయం వద్ద ఈ భేటీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిని ఖరారు చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం మరియు రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించనున్నారు. శింగనమల గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పార్టీ అభిమానులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

సూరేపల్లిలో స్థల వివాదం మహిళపై దాడి, కేసు నమోదు



పుట్టూరు (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : పుట్టూరు మండల పరిధిలోని సూరేపల్లి గ్రామంలో ఇంటి సమీపంలోని స్థలానికి సంబంధించి తలెత్తిన వివాదం కారణంగా ఓ మహిళపై దౌర్జన్యం జరిగినట్లు స్థానిక ఎస్ఐ సురేంద్రబాబు గురువారం వెల్లడించారు. గ్రామానికి చెందిన మద్దినేని రమణి అనే మహిళపై అదే గ్రామానికి చెందిన మద్దినేని బాలరంగయ్య, భాగ్యలక్ష్మి దాడికి పాల్పడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. గతంలో వీరి మధ్య తలెత్తిన వివాదాలను మనసులో ఉంచుకొని, కక్ష కట్టిన నిందితులు రమణిపై ఈ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధితురాలికి గాయాలయ్యాయి. బాధితురాలు రమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించి నిందితులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై అన్ని కోణాలలోనూ దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనంతపురం డిప్యూటీ మేయర్ పదవిని ఎస్సీలకు కేటాయించాలి

దళితులకు రాజకీయ న్యాయం చేయాలని దళిత సంఘం నాయకుడు చిన్న ఆంజనేయులు డిమాండ్



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : అనంతపురం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని దళిత సంఘం నాయకుడు చిన్న ఆంజనేయులు డిమాండ్ చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ దళితులకు రాజకీయ అధికారంలో సముచిత స్థానం కల్పించకపోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎస్సీ సామాజిక వర్గానికి మేయర్ పదవి కానీ, డిప్యూటీ మేయర్ పదవి కానీ దక్కకపోవడం దళితులకు జరుగుతున్న రాజకీయ అన్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. ?ఎన్నికల సమయంలో మాత్రమే దళిత కుటుంబాల గడపలు తొక్కి ఓట్లు అడిగే రాజకీయ నాయకులు, అధికార పదవులు కేటాయించే సమయంలో మాత్రం దళితులను పూర్తిగా విస్మరిస్తున్నారని చిన్న ఆంజనేయులు విమర్శించారు. దళితులు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా, ఎన్నికల సమయంలో గుర్తుకొచ్చే ఓటు బ్యాంకుగా మాత్రమే మిగిలిపోయారని, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో కూడా తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదని అన్నారు. స్టాండింగ్ కమిటీలు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు, ఇతర నామినేటెడ్ పదవుల్లో సముచిత అవకాశాలు ఇవ్వకుండా దళితులను పక్కన పెట్టడం సమంజసం కాదని, రాజకీయ పార్టీలు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ?డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లు, ఓటు హక్కుల ఫలితంగానే నేడు ప్రతి దళిత కుటుంబం రాజకీయ నాయకులను ప్రశ్నించే స్థాయికి వచ్చిందని, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితులకు రాజకీయ అధికారంలో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందని గుర్తు చేశారు. అనంతపురం నగరంలో దళితులకు మేయర్ లేదా డిప్యూటీ మేయర్ పదవి దక్కకపోవడం వెనుక ఉన్న కారణాలను రాజకీయ పార్టీలు ప్రజలకు వివరించాలని కోరారు. తమ పోరాటం ఎవరి మీదనో వ్యతిరేకతతో కాదని, కేవలం రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం చేస్తున్న ప్రజాస్వామ్య డిమాండ్ అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో, స్టాండింగ్ కమిటీల్లో, ఇతర కీలక నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి, దళితులను సమాన హక్కులు కలిగిన రాజకీయ భాగస్వాములుగా గుర్తించాలని కోరారు. తరతరాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న సామాజిక న్యాయం, రాజకీయ సమానత్వం కోసం దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, యువత మౌనం వీడి ఐక్యంగా పోరాడాలని చిన్న ఆంజనేయులు పిలుపునిచ్చారు.

తాడిపత్రిలో బియ్యం ధరల నియంత్రణపై సివిల్ సప్లైస్ అధికారుల ప్రత్యేక సమావేశం



తాడిపత్రి (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : తాడిపత్రి పట్టణంలో బియ్యం ధరలను నియంత్రించి, వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందుబాటులో ఉంచే ఉద్దేశంతో గురువారం తాడిపత్రి మండల సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో మండీ వ్యాపారుల సంఘం ప్రతినిధులతో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ గత అక్టోబర్ 27న నిర్వహించిన సమావేశంలో ఖరారు చేసిన వివిధ బియ్యం రకాల ధరలను వ్యాపారులకు పూర్తిగా వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వినియోగదారులకు బియ్యాన్ని విక్రయించాలని ఈ సందర్భంగా అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిన బియ్యం ధరల వివరాల ప్రకారం.. **BPT**-3291 (సోనా) కిలో రూ.66, **BPT**-5204 (సాంబా) కిలో రూ.66, ఖచీవీ రకం కిలో రూ.66, Hమీ రకం కిలో రూ.76, **RNR** రకం కిలో రూ.76, జై శ్రీరామ్ రకం కిలో రూ.82 మరియు మీఖ సాధారణ రకాల బియ్యం కిలో రూ.47 చొప్పున విక్రయించాలని ధరలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ, ఒకే రకమైన నాణ్యత కలిగిన బియ్యాన్ని కేవలం బ్రాండ్ పేర్లు మార్చి వినియోగదారులకు అధిక ధరలకు విక్రయించడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా వినియోగదారుల నుంచి ఎలాంటి అదనపు మొత్తాలు వసూలు చేయకూడదని సూచించారు. ప్రతి హోల్‌సేల్ మరియు రిటైల్ బియ్యం దుకాణంలోనూ ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం రకాలు మరియు వాటి ధరలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ధరల పట్టికను వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, ప్యాకింగ్ చేసిన ప్రతి బియ్యం సంచిపై సంబంధిత బియ్యం రకం మరియు గరిష్ట చిల్లర విక్రయ ధర స్పష్టంగా ముద్రించి ఉండాలని స్పష్టం చేశారు. ముద్రించిన గరిష్ట చిల్లర విక్రయ ధర కంటే అధిక ధరకు విక్రయాలు జరిపితే కఠిన చర్యలుంటాయని తెలిపారు. వ్యాపారులు బియ్యం కొనుగోలు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు మరియు విక్రయాలకు సంబంధించిన రికార్డులను ఎప్పుడూ సక్రమంగా నిర్వహించాలని, తనిఖీల సమయంలో అధికారులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రభుత్వ ధరల నియంత్రణ కార్యక్రమానికి వ్యాపారులందరూ పూర్తిగా సహకరించి, సామాన్య ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా బియ్యం విక్రయాలు జరిపినట్లు, అధిక ధరలు వసూలు చేసినట్లు తనిఖీల్లో తేలితే సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఎన్ మాధవి లత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో న్యుమోనియా నివారణకు 'సాన్స్' ప్రత్యేక కార్యక్రమం

డీఎంహెచ్ఓ డా. కట్టా వెంకటేశ్వర్లు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల్లో న్యుమోనియా వ్యాధిని నివారించడం, వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం మరియు సకాలంలో మెరుగైన వైద్య చికిత్స అందించే లక్ష్యంతో జిల్లాలో 'సాన్స్' అనే ప్రత్యేక అవగాహన, చికిత్స కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డా. కట్టా వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల మరణాలకు న్యుమోనియా ఒక ప్రధాన కారణమని, దేశవ్యాప్తంగా ఈ వయసు పిల్లల మరణాల్లో సుమారు 17.2 శాతం కేవలం న్యుమోనియా వల్లే సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా చిన్నారుల మరణాలను గణనీయంగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలులో భాగంగా జిల్లా స్థాయిలో సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బందితో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు. వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఆశా ఫెసిలిటేటర్లకు వ్యాధి గుర్తింపు, చికిత్సలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో న్యుమోనియా చికిత్సకు అవసరమైన అమోక్సిసిలిన్, జెంటామైసిన్, ఆంపిసిలిన్ వంటి అత్యవసర మందులతో పాటు పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, నెబ్యులైజర్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్ల ద్వారా ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ఐదేళ్ల లోపు పిల్లల్లో న్యుమోనియా లక్షణాలను గుర్తించి వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాలకు తరలించి చికిత్స అందిస్తామని డా. కట్టా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. దీనితో పాటు పుట్టిన మొదటి ఆరు నెలల పాటు శిశువులకు సంపూర్ణ తల్లిపాలు ఇవ్వడం, చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వాయు కాలుష్య నివారణ చర్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. వ్యాధి నిరోధకత కోసం అర్హులైన పిల్లలందరికీ నూరు శాతం పీసీవీ వ్యాక్సినేషన్ మూడు డోసులు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేశారు.

పుట్టపర్తిలో పకడ్బందీగా జనగణన రెండో దశ నిర్వహణ

ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణలో జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం





పుట్టపర్తి(తెలుగు కలం) (నవంబర్ 12) : గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో జరగనున్న జనగణన రెండో దశ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ సమక్షంలో, జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రగతికి మరియు భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు జనగణన గణాంకాలు ఎంతో కీలకమని తెలిపారు. క్షేత్రస్థాయి విధుల నిర్వహణలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర వెన్నెముక వంటిదని పేర్కొన్నారు. నేడు శిక్షణ పొందిన ఈ ఫీల్డ్ ట్రైనర్లు తదుపరి దశలో క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా విధులు నిర్వహించే సూపర్‌వైజర్లు మరియు ఎన్యూమరేటర్లకు నాణ్యమైన శిక్షణను అందిస్తారని తెలిపారు. జనగణన ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ మార్గదర్శకాలు మరియు విధివిధానాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ జనగణన రెండో దశ షెడ్యూల్ ప్రకారం, జనవరి 10 నుండి జనవరి 24 వరకు స్వీయ గణన నిర్వహించబడుతుంది. ఈ 15 రోజుల కాలంలో ప్రజలు డిజిటల్ మాధ్యమాల ద్వారా స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించబడింది. ఆ తర్వాత జనవరి 25 నుండి ఫిబ్రవరి 28 వరకు మొత్తం 35 రోజుల పాటు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే రూపంలో క్షేత్రస్థాయి జనగణన కొనసాగుతుంది. ఈ సమయంలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలను సేకరిస్తారు. చివరగా మార్చి 1 నుండి మార్చి 5 వరకు ఐదు రోజుల పాటు పునఃపరిశీలన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కాలంలో ఎవరైనా నమోదు కాకుండా మిగిలిపోయినా, లేదా మార్పులు చేర్పులు ఉన్నా సరిచేయబడతాయి. జనగణన ప్రక్రియలో భాగంగా నియమించబడిన ఫీల్డ్ ట్రైనర్లు శిక్షణ తరువాత ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చి ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను సేకరిస్తుండగా, సూపర్‌వైజర్లు ఈ మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ తగు సూచనలు అందిస్తారని అధికారులు తెలిపారు. జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి కుటుంబానికి సంబంధించిన ఖచ్చితమైన మరియు వాస్తవ సమాచారాన్ని సేకరించడం ద్వారా అత్యంత విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించవచ్చని పేర్కొన్నారు. ఈ జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం అందించి పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో తాటిమాను

మారెమ్మ అమ్మవారి నూతన విగ్రహ దర్శనం



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : పట్టణంలోని మారేంపల్లి ప్రాంతంలో కొలువై ఉన్న గ్రామదేవత తాటిమాను మారెమ్మ అమ్మవారి నూతన విగ్రహం భక్తులకు దర్శనమిస్తోంది. తరతరాలుగా మారేంపల్లి ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధించే అమ్మవారి నూతన విగ్రహ దర్శనానికి అందుబాటులోకి రావడంతో స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. అమ్మవారి నూతన రూపాన్ని దర్శించుకునేందుకు స్థానిక భక్తులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, యువత పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆలయ సన్నిధికి చేరుకున్న భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి, పూలమాలలతో అలంకరించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. తమ కుటుంబాల్లో సుఖసంతోషాలు నెలకొనాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పట్టణ ప్రజలందరూ యురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ప్రార్థనలు చేస్తున్నారు. రానున్న పండుగలు, పర్వదినాల సమయంలో అమ్మవారికి మరింత ఘనంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు సన్నద్ధమవుతున్నారు. మారేంపల్లి ప్రాంతంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత విస్తరించాలని, ఆలయ అభివృద్ధికి దాతలు, స్థానికులు సమష్టిగా సహకరించాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. తాటిమాను మారెమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు పట్టణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని వారు వేడుకుంటున్నారు.

తక్కువ నీటితో అధిక ఫలితం..

ప్రత్యామ్నాయ పంటలపై నిజవల్లి రైతుల దృష్టి



కుందుర్పి (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు నిజవల్లి గ్రామ రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో స్థానిక వాతావరణానికి అనుకూలమైన పంటలను ఎంచుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల పరిధిలోని నిజవల్లి గ్రామంలో దాదాపు 85 శాతం మంది రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలను సాగు చేసినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు, ఏఎఫ్ ఎకాలజీ ప్రతినిధులు గ్రామంలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా చెరువులోని ఒండ్రు మట్టిని పొలాలకు తరలించిన భూముల్లో సాగు చేసిన పంటల స్థితిగతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటల ఎదుగుదల, నేల స్వభావం, సాగు విధానాలతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై శాస్త్రవేత్తలు ఆరా తీశారు. తక్కువ నీటి వనరులతో సాగు చేసుకునే ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అమలు, వాతావరణ మార్పులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల వైవిధ్యానికి ప్రాధాన్యమిస్తూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపట్టడం ద్వారా వ్యవసాయంలో ఎదురయ్యే నష్టాలను తగ్గించుకునే అవకాశాలపై వివరాలు సేకరించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో శాస్త్రవేత్తలు డాక్టర్ యలమందరెడ్డి, చెన్నారాయుడు, గోపినాథ్, తిరుపతిరెడ్డి

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 13 - 11 - 2026

సోమందేపల్లిలో వైసీపీ ఆత్మీయ సమీక్ష

కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపిన ఉషశ్రీ చరణ్

ఓటమి చెందిన ఎంపీటీసీ అభ్యర్థులకు ఘన సన్మానం



సోమందేపల్లి (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : సోమందేపల్లి మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీలో మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రివర్యులు, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీ చరణ్ గారు ఆత్మీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవలి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులు, కార్యకర్తల కృషిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అధికార పార్టీ నుంచి ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా వెనకడుగు వేయకుండా ధైర్యంగా పోరాడి, అతి తక్కువ మెజార్టీతో ఓటమి చెందిన వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులను ఆమె ఘనంగా సన్మానించారు. ?ఈ సమావేశంలో ఉషశ్రీ చరణ్ గారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములు తాత్కాలికమని, కానీ పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాటం, పడిన కష్టం ఎన్నటికీ మరువలేనిదని అన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ, ప్రజా పక్షాన నిలబడటమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పేర్కొంటూ, ఎన్నికల్లో ఓటమి చెందామని ఎవరూ నిరుత్సాహపడవద్దని, ధైర్యాన్ని కోల్పోకుండా మరింత పట్టుదలతో, ఐక్యతతో ముందుకు సాగాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని ఉషశ్రీ చరణ్ గారు తెలిపారు. పార్టీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి పోరాటంలో తాను కూడా తోడుగా నిలుస్తానని భరోసా ఇవ్వడంతో నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం, ఆత్మవిశ్వాసం వెల్లివిరిశాయి.

అహోబిలం భక్తుల సౌకర్యార్థం యూనియన్

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆటో విరాళం



ఆళ్లగడ్డ (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు తమ సేవాభావాన్ని చాటుకుంటూ ఒక ఆటో వాహనాన్ని విరాళంగా అందించారు. గురువారం అహోబిలంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు అధికారులు ఈ వాహనాన్ని ఆలయ వర్గాలకు అందజేశారు. సుదూర ప్రాంతాల నుండి స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తుల రవాణా అవసరాలను తీర్చి, వారికి మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సదుద్దేశంతో యూనియన్ బ్యాంక్ అధికారులు ఈ వాహనాన్ని విరాళంగా అందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా అహోబిలం నరసింహస్వామి భక్తులు మాట్లాడుతూ, పుణ్యక్షేత్ర అభివృద్ధికి మరియు భక్తుల సేవకు సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన యూనియన్ బ్యాంక్ అధికారులకు అహోబిలం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అహోబిలం సీఏఓ మాధవన్, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ యదుభూషణ్ రెడ్డి, అహోబిలం యూనియన్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర ఆచారి, అకౌంటెంట్ సత్యదేవ్ మరియు ఇతర ఆలయ, బ్యాంకు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అనంతపురంలో మెడికల్ షాపులపై

ఈగల్ టీమ్ ఆకస్మిక తనిఖీలు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : అనంతపురం నగరంలో మెడికల్ షాపులపై ఈగల్ టీమ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ గరుడలో భాగంగా రుద్రంపేట బైపాస్ వద్ద ఉన్న హేమంత్ మెడికల్ అండ్ ఫ్యాన్సీ షాపులో ఈ సర్ప్రైజ్ చెకింగ్ చేపట్టారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ పి. జగదీష్ సూచనలతో ఈ తనిఖీలు కొనసాగాయి. ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు అందిన సమాచారం ఆధారంగా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ మస్తాన్, ఎస్ఐ షేక్షావలి, సిబ్బందితో పాటు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సంయుక్తంగా పాల్గొన్నారు. వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండానే కొన్ని మందులను విక్రయిస్తున్నట్లు అధికారులు ఈ తనిఖీల్లో గుర్తించారు. ముఖ్యంగా ఎన్ఆర్ఎక్స్ కేటగిరీకి చెందిన మందులను సైతం సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించినట్లు వెల్లడైంది. ఈ నిబంధనల ఉల్లంఘనలపై డ్రగ్ కంట్రోల్ అధికారులు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. మత్తు మందుల అక్రమ విక్రయాలు, దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు మునుముందు కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇక మత్తు మందుల అక్రమ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఏమైనా తెలిస్తే ప్రజలు వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని అధికారులు కోరారు. అలా సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఈగల్ సెల్ అనంతపురం వెల్లడించింది.

మైదుకూరులో మున్సిపల్ పన్నుల చెల్లింపులు

ఇక పూర్తిగా ఆన్‌లైన్‌కే పరిమితం



మైదుకూరు (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : కడప జిల్లా మైదుకూరు పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ పన్నుల చెల్లింపులను ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే స్వీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ వై. రంగస్వామి తెలిపారు. మున్సిపల్ పన్నుల వసూళ్లలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా మైదుకూరు పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డులతో పాటు స్వర్ణ వార్డుల పరిధిలోనూ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పకడ్బందీగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు ఆస్తిపన్ను, నీటిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులతో పాటు ఇతర అన్ని రకాల మున్సిపల్ ఫీజులను ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలని సూచించారు. పన్నుల చెల్లింపుల్లో డిజిటల్ విధానాన్ని వినియోగించడం ద్వారా అధికారిక లావాదేవీల్లో పారదర్శకతకు ఎంతో తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. మైదుకూరు పురపాలక సంఘం పరిధిలోని ప్రజలందరూ ఈ నూతన డిజిటల్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. సకాలంలో పన్నులు చెల్లించి మురపాలక సంఘం అభివృద్ధికి, పట్టణ పురోభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని వై. రంగస్వామి విజ్ఞప్తి చేశారు.

రాయచోటిలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



రాయచోటి (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : రాయచోటి పట్టణంలోని వేంపల్లి రింగ్ రోడ్డు సమీపంలో నిర్మిస్తున్న మైనారిటీ బాలుర, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, భవనాల నాణ్యత, విద్యార్థులకు కల్పించనున్న మౌలిక వసతుల గురించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మైనారిటీ బాలుర, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కొక్క పాఠశాలకు రూ.18 కోట్ల చొప్పున మొత్తం రూ.36 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలలో సుమారు 540 మంది విద్యార్థులకు వసతి కల్పించే విధంగా భవనాలను నిర్మిస్తున్నామని, పాఠశాల భవనాలతో పాటు విద్యార్థులకు అవసరమైన డార్మిటరీలు, వంటశాల, భోజనశాల తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాలుర పాఠశాల నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని, అలాగే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను జనవరి నెలాఖరులోగా పూర్తిచేసి అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండిండికీ కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.20 కోట్ల మేర పనులు పూర్తికాగా, అందులో రూ.14 కోట్ల బిల్లులు చెల్లించినట్లు, మరో రూ.6 కోట్ల మేర బిల్లులు సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ పనులన్నీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వంటశాల, భోజనశాల, విద్యార్థుల వసతి గదులు, ఇతర మౌలిక వసతులను స్వయంగా పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలను సమకూర్చాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన తేదీ నాటికి భవనాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తేల్చిచెప్పారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో డీఈ సుధాకర్ బాబు, సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సైట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానానికి టాటా గూడ్స్ కంటైనర్ ట్రక్ విరాళం



శ్రీశైలం (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : శ్రీశైలం దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నూతన టాటా గూడ్స్ కంటైనర్ ట్రక్‌ను విరాళంగా అందజేశారు. శ్రీశైలంలోని గంగాధర మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఈ వాహనాన్ని మరియు దానికి సంబంధించిన పత్రాలను దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడుకు అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు, అర్చకస్వాములు, దేవస్థానం అధికారులు మరియు బ్యాంకు ప్రతినిధులు కలిసి సంప్రదాయబద్ధంగా వాహన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ, దేవస్థానం సేవార్థం టాటా గూడ్స్ కంటైనర్ ట్రక్‌ను కొనుగోలు చేసి విరాళంగా అందజేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ, ఈ వాహనాన్ని అన్నప్రసాద వితరణకు అవసరమైన కూరగాయలను సకాలంలో సరఫరా చేసుకునేందుకు పూర్తిస్థాయిలో వినియోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ సుధాకర్, శ్రీశైలం బ్రాంచ్ మేనేజర్ రవీంద్రారెడ్డి, ఇతర బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారులు జి. స్వాములు, యం. హరియానాయక్, పి. ఉమేష్, పర్యవేక్షకులు సి.హెచ్. కోమలి, ట్రాన్స్‌పోర్టు విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ యం. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో ప్రమాదకరంగా మారిన రోడ్డు డివైడర్ కమ్మీలు

ఆదమరిస్తే పెను ప్రమాదమే!



అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పట్టణంలోని రద్దీ ప్రాంతమైన సంత సర్కిల్ సమీపంలో, టీటీడీ కల్యాణ మండపం వద్ద రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ కమ్మీలు పూర్తిగా వంగిపోయి అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు మరియు కార్లలో వెళ్లేవారు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ఈ ఇనుప కమ్మీలు గుద్ది తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. స్థానికుల కథనం ప్రకారం, రోడ్డుపై నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో డివైడర్ కమ్మీలు ఇలా దెబ్బతిని రోడ్డు వైపునకు వంగిపోవడం వల్ల రాత్రి సమయాల్లో ప్రయాణం చేయడం మరింత కష్టతరంగా మారుతోంది. చీకటిలో లేదా వేగంగా వచ్చే వాహనదారులకు ఇవి సరిగ్గా కనిపించక అకస్మాత్తుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. విరిగిపోయి, పదునుగా ఉన్న ఈ ఇమ్మడి కమ్మీలు వాహనాల టైర్లను దెబ్బతీయడంతో పాటు, పాదచారులకు మరియు ప్రయాణికులకు కూడా తీవ్ర గాయాలయ్యే ముప్పు పొంచి ఉంది. ఈ సమస్యపై స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే ప్రమాదకరంగా మారిన ఆ డివైడర్ కమ్మీలను వెంటనే తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై

ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు



మార్కాపురం (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మరియు ప్రయాణికుల భద్రతను అత్యంత ప్రాధాన్య అంశాలుగా భావిస్తూ మార్కాపురం ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా అవగాహన మరియు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అహరోన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆటో డ్రైవర్లకు పలు కీలక సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ అహరోన్ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు అందరూ విధిగా యూనిఫాం ధరించాలని మరియు తమ వెంట సక్రమమైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడేలా పరిమితికి మించి ఎవరినీ ఆటోల్లో ఎక్కించరాదని ఆయన గట్టిగా హెచ్చరించారు. రోడ్లపై ప్రయాణించే ఇతర వాహనదారులకు లేదా పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలపకుండా కేవలం మార్జిన్లలోనే పార్కింగ్ చేయాలని సూచించారు. ప్రయాణికుల భద్రత కోసం అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని, భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ అహరోన్ హెచ్చరించారు. పట్టణంలో సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని కల్పించడంలో ఆటో డ్రైవర్లందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు పూర్తిగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

జాతీయ రహదారిపై కార్లు ఢీకొని ఇద్దరు మృతి



సింగరాయకొండ (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : ప్రకాశం జిల్లా సింగరాయకొండ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై ఉన్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్వే వద్ద పోలేరమ్మ గుడి సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒంగోలు వైపు వెళ్తున్న ఒక కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను కూరపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఇమ్రాన్ తాహిర్ లుగా గుర్తించారు. వీరు ఇద్దరూ పొన్నలూరు మండలం సింగరాబోట్లపాలెం గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్సై సుధీర్ కుమార్ వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జాతీయ రహదారిపై ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

శ్రీకాళహస్తిలో వ్యవసాయ మోటార్ల

దొంగల ముఠా అరెస్ట్ 22 మోటార్లు స్వాధీనం



శ్రీకాళహస్తి (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని పొలాల వద్ద వ్యవసాయ మోటార్లను దొంగిలిస్తున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.4,40,000 విలువైన 22 మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు శ్రీకాళహస్తి డీఎస్పీ పావని వెల్లడించారు. తొట్టంబేడు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు వివరించారు. ఇటీవల డివిజన్‌లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పొలాల వద్ద ఉన్న మోటార్లు చోరీకి గురవుతున్నట్లు రైతుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయని, దీనిపై వెంటనే స్పందించి కేసులు నమోదు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. పోలీసుల నిఘాలో భాగంగా జయంపు ఈశ్వర్, దేవరకొండ అజిత్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు ఈ చోరీలతో సంబంధం ఉన్న మరో ఇద్దరిపై కూడా కేసులు నమోదయ్యాయని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు. నిందితులిద్దరూ రాత్రి సమయాల్లో పొలాల వద్ద ఎవరూ లేని సమయం చూసి మోటార్లను అపహరిస్తున్నట్లు విచారణలో అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న 22 మోటార్లను త్వరలోనే సంబంధిత రైతులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె హామీ ఇచ్చారు. ఈ కేసును ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో తొట్టంబేడు ఎస్సై బాలకృష్ణ మరియు ఆయన బృందం ఎంతో కృషి చేశారని డీఎస్పీ పావని అభినందించారు. ప్రతిభ కనబరిచిన ఈ పోలీసు బృందానికి రానున్న గణతంత్ర దినోత్సవం (రిపబ్లిక్ డే) సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేసేలా కార్యాచరణ చేపడుతున్నట్లు ఆమె ప్రకటించారు.

కర్నూలులో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా

ప్రత్యేక కార్యాచరణ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : కర్నూలు జిల్లాలో ఈ ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు. గురువారం సునయన ఆడిటోరియంలో కర్నూలు విద్యా డివిజన్ పరిధిలోని పదో తరగతి పబ్లిక్ పరీక్షల వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఏడాది పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నిరంతర అభ్యసనం, స్లిప్ టెస్టులు మరియు ప్రత్యేక పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టడం ద్వారా ఉత్తీర్ణత శాతాన్ని సుమారు 10 శాతం పెంచగలిగామని కలెక్టర్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా మంచి ఫలితాలను సాధించాలని, ఈ లక్ష్య సాధనలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు. ఒక విద్యార్థి జీవితాన్ని మార్చగల శక్తి ఉపాధ్యాయులకు ఉంటుందని తెలిపారు. కర్నూలు జిల్లాలో వలసలు మరియు ఇతర కారణాల వల్ల మధ్యలోనే చదువు మానేసి బడికి దూరమైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పాఠశాలలో బడి మానేసిన విద్యార్థుల వివరాలను గుర్తించి, ఒక్కో పాఠశాల పరిధిలోని సుమారు ఏడెనిమిది మంది విద్యార్థులను తిరిగి బడికి రప్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు తమ పాఠశాలలోని ఇద్దరు లేదా ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి విద్యార్థుల ఇళ్లకు పంపాలని సూచించారు. తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను తిరిగి పాఠశాలకు పంపేలా అవగాహన కల్పించాలని, రానున్న పది రోజులను ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహించి కనీసం 70 శాతం మంది విద్యార్థులనైనా తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ విద్యార్థుల హాజరును పర్యవేక్షిస్తూ గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు. గణితం, ఆంగ్లం, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రత్యేక బోధన అందించాలని కలెక్టర్ తెలిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రెమెడియల్ తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థికి రోజువారీగా రెండు పాఠాలు లేదా నిర్దిష్ట అంశాలపై హోంవర్క్ ఇచ్చి, మరుసటి రోజు వాటిపై ప్రశ్నలు అడిగి అభ్యసన స్థాయిని అంచనా వేయాలని చెప్పారు. 'రైజింగ్ స్టార్స్'గా ఉన్న విద్యార్థులను మరింత ప్రోత్సహించి 'షైనింగ్ స్టార్స్' స్థాయికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పదో తరగతి సిలబస్‌ను నవంబర్ నెలాఖరులోగా అన్ని పాఠశాలల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని నిర్దేశించిన మెనూ ప్రకారం సకాలంలో అందించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రుల నుంచి పాఠశాలలపై సానుకూల అభిప్రాయం వచ్చేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. సుధాకర్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ లోకరాజు, డిప్యూటీ డిఈవో శ్రీధర్ బాబు, కర్నూలు డివిజన్ మండల విద్యాధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో మెగా వైద్య శిబిరం: ప్రజలు సద్వినియోగం

చేసుకోవాలని అడిషనల్ డీఎండహెచ్వో డాక్టర్ జయలక్ష్మి పిలుపు



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 12) : ప్రతినిధి : ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ జయలక్ష్మి సూచించారు. గురువారం గుంతకల్లు పట్టణంలోని 20వ వార్డు సచివాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను నేరుగా వారి వార్డులకే అందించాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రజలకు సమగ్రమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా జనరల్ హెల్త్ చెకప్ తో పాటు, రక్తపోటు (బి.పి), మధుమేహం (షుగర్), హిమోగ్లోబిన్ (హెచ్.బి) స్థాయిలపై పరీక్షలు చేపట్టారు. అలాగే అత్యంత ప్రాముఖ్యమ

రాత్రంతా ఉంచిన పాల గిన్నెను 2 నిమిషాల్లో ఎలా శుభ్రం చేయాలో మీకు తెలుసా



రాత్రంతా బయట ఉంచిన పాల గిన్నెను శుభ్రం చేయడం నిజంగా కష్టమే. పాలు విరిగిపోయినప్పుడు లేదా పాలతో గిన్నెలో అలాగే ఉంచినప్పుడు పాలకు సంబంధించిన మీగడ గిన్నెకు గట్టిగా అతుక్కుపోతుంది. సాధారణంగా కదగడం చాలా కష్టం. అయితే, ఈ మరకలను సులభంగా తొలగించగల కొన్ని ఇంటి నివారణలు ఉన్నాయి.

1. వేడి నీరు, బేకింగ్ సోడా : ముందుగా గిన్నెలో వేడి నీటిని పోసి కాసేపు నాననివ్వండి. తరువాత 1 టీస్పూన్ బేకింగ్ సోడా చల్లుకోండి. కొద్దిసేపు ఆగి స్పాంజ్ లేదా గట్టి బ్రష్ తో రుద్దండి. ఇది ఎండిన పాలు సులభంగా బయటకు రావడానికి సహాయపడుతుంది.

2. నిమ్మరసం లేదా వెనిగర్ ఉపయోగించడం నిమ్మరసం లేదా తెల్ల వెనిగర్ సహజ ఆమ్లంగా పనిచేస్తుంది. ఇది పాల ప్రోటీన్ పొరపై బాగా పనిచేస్తుంది. గిన్నెలో నిమ్మరసం లేదా వెనిగర్ పోసి 15-20 నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత స్క్రబ్ చేసి శుభ్రం చేసుకోండి.

3. ఉప్పు, వేడి నీరు ఒక సహజ స్క్రబ్బర్. గోరువెచ్చని నీటితో కొంచెం ఉప్పు కలిపి, ఆ నీటితో గిన్నెను నానబెట్టండి. తర్వాత ఎండిన పాలను రుద్దండి.

4. ఒక గిన్నెలో కొంచెం డిష్ వాషింగ్ లిక్విడ్, వేడి నీటిని పోసి రాత్రంతా నానబెట్టినట్లయితే, ఉదయం సులభంగా కడగవచ్చు. పాల వాసనను కూడా తొలగిస్తుంది.

5. పాత టూత్ బ్రష్ లేదా స్పాంజ్ ఉపయోగించండి . మీ చేతులు చేరలేని మూలల్లో పాత టూత్ బ్రష్ ఉపయోగించండి. ఇది మూలలకు అంటుకున్న ఎండిన పాలను తొలగించడానికి కూడా సహాయపడుతుంది. కడిగిన తర్వాత పూర్తిగా ఆరబెట్టండి. లేకుంటే వాసన అలాగే ఉండవచ్చు. రాత్రిపూట పాల పాత్రను బాగా కడిగితే తర్వాత ఎలాంటి సమస్యలు ఉండవు. పాలను స్టీల్ లేదా గాజు పాత్రలో నిల్వ చేయడం వల్ల శుభ్రం చేయడం సులభం. ఎండిన పాల గిన్నెను రాత్రంతా శుభ్రం చేయడం మొదట్లో కష్టంగా అనిపించవచ్చు. కానీ పైన పేర్కొన్న చిట్కాలను పాటిస్తే అది సులభం అవుతుంది. మీకు కావలసిందల్లా కొంచెం ఓపిక, సరైన విధానం. మీరు క్రమం తప్పకుండా శుభ్రపరచడం కొనసాగిస్తే, భవిష్యత్తులో మీరు అలాంటి సమస్యలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదు.

కష్టాలతో విసిగిపోయారా.. నిజంగా జీవితాన్ని గెలవాలంటే ఇలా మారి చూపించండి

జీవితంలో ఎత్తు పల్లాలు అనివార్యం. అవి మనల్ని బలపరిచే మెట్ల వంటివి. వైఫల్యాలను సవాళ్లుగా, విజయాలను ప్రోత్సాహంగా భావించండి. సానుకూల దృక్పథం, కృషి, సహనంతో జీవిత నిచ్చెనను ఎక్కండి. ప్రతి అడుగు మీకు కొత్త గమ్యాన్ని చూపిస్తుంది. ఈ ఎత్తు పల్లాలను స్వీకరించి, మీ జీవితాన్ని విజయవంతంగా, సంతోషంగా మార్చుకోండి. ఇందుకు ఈ సీక్రెట్ టిప్స్ మీకు ఉపయోగపడతాయి. జీవితం ఒక సుదీర్ఘ ప్రయాణం, ఇందులో ఎత్తు పల్లాలు సహజం. విజయాలు, వైఫల్యాలు, సంతోషాలు, బాధలు ఈ ప్రయాణంలో భాగమే. ఈ ఎత్తు పల్లాలు జీవిత మెట్లపై మనం ఎక్కే మెట్ల వంటివి. ప్రతి అడుగు మనల్ని కొత్త అనుభవాల వైపు, బలమైన వ్యక్తిత్వం వైపు నడిపిస్తుంది. జీవితంలోని ఈ ఎత్తు పల్లాలను సానుకూల దృక్పథంతో ఎలా స్వీకరించాలో, అవి మనల్ని ఎలా ఉన్నతంగా నిలబెడతాయో తెలుసుకుందాం.



ఎత్తు పల్లాలు.. జీవితంలో అనివార్యం

జీవితంలో ప్రతి వ్యక్తి విజయాలను, వైఫల్యాలను ఎదుర్కొంటాడు. విజయం మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపితే, వైఫల్యం ఓపికను, సహనాన్ని నేర్పిస్తుంది. ఈ రెండూ లేకపోతే జీవితం రుచిహీనంగా మారుతుంది. ఒక విజయవంతమైన వ్యక్తి కథను చూస్తే, దాని వెనుక అనేక వైఫల్యాలు, సవాళ్లు దాగి ఉంటాయి. ఉదాహరణకు, థామస్ ఎడిసన్ వేల సార్లు విఫలమైన తర్వాతే బల్బును కనుగొన్నాడు. వైఫల్యం అతన్ని ఆపలేదు, బదులుగా కొత్త మార్గాలను చూపించింది.

వైఫల్యం: ఒక అవకాశం

వైఫల్యాన్ని చాలామంది ప్రతికూలంగా చూస్తారు. కానీ, వైఫల్యం అనేది కొత్త పాఠాలను నేర్చుకునే అవకాశం. ఇది మన బలహీనతలను తెలియజేస్తుంది, మనలో మెరుగైన వ్యక్తిని తీర్చిదిద్దుతుంది. ఒక పరీక్షలో విఫలమైన విద్యార్థి మరింత కష్టపడి, తన లోపాలను సరిదిద్దుకుని విజయం సాధిస్తాడు. అదే విధంగా, వ్యాపారంలో నష్టపోయిన వ్యక్తి కొత్త వ్యూహాలతో మరింత బలంగా తిరిగి వస్తాడు. వైఫల్యం మనల్ని నిరాశపరచడానికి కాదు, మనల్ని మరింత దృఢంగా నిలబెట్టడానికి.

విజయం: కృషి ఫలం

విజయం అనేది కష్టపడిన వారికి లభించే బహుమతి. ఇది మనలో ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అయితే, విజయం శాశ్వతం కాదు. దానిని నిలబెట్టుకోవడానికి నిరంతర కృషి, నేర్చుకునే తత్వం అవసరం. ఒక విజయవంతమైన వ్యక్తి తన విజయాన్ని గర్వంగా భావించకుండా, దానిని మరింత ఎదగడానికి ఒక మెట్టుగా భావించాలి. ఉదాహరణకు, ఒక క్రీడాకారుడు ఒక పోటీలో గెలిచిన తర్వాత మరింత కష్టపడి, కొత్త లక్ష్యాలను సాధిస్తాడు.

ఎత్తు పల్లాలను స్వీకరించడం

జీవితంలో ఎత్తు పల్లాలను సానుకూల దృక్పథంతో స్వీకరించడం చాలా ముఖ్యం. ఈ క్రింది చిట్కాలు ఈ ప్రయాణంలో సహాయపడతాయి. ప్రతి అనుభవం ఒక పాఠంగా భావించండి. వైఫల్యం వచ్చినప్పుడు నిరాశ చెందకుండా, దాని నుండి నేర్చుకోండి. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకోండి. ప్రతి లక్ష్య సాధన మీకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. విజయం రాత్రికి రాత్రి సాధ్యం కాదు. సహనంతో, క్రమశిక్షణతో ముందుకు సాగండి. కుటుంబం, స్నేహితులు, గురువుల మద్దతు తీసుకోండి. వారి సలహాలు, ప్రోత్సాహం మీ బలాన్ని పెంచుతాయి. ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించండి.

జీవితాన్ని ఇలా గెలిచేయండి..

జీవితం అనేది ఒక నిచ్చెన లాంటిది. ప్రతి ఎత్తు, ప్రతి పల్లం ఒక మెట్టు. ఈ మెట్లను ఎక్కడానికి ధైర్యం, సహనం, నమ్మకం అవసరం. ఒక మెట్టు జారినా, మరో మెట్టును గట్టిగా పట్టుకోవడం నేర్చుకోవాలి. ప్రతి అడుగు మనల్ని ఉన్నత శిఖరాల వైపు నడిపిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యాపారి నష్టాలను ఎదుర్కొని, కొత్త వ్యూహాలతో మళ్లీ విజయం సాధించాడు. అదే విధంగా, ఒక విద్యార్థి పరీక్షలో విఫలమై, మరింత కష్టపడి ఉత్తీర్ణత సాధించాడు. ఈ కథలు మనకు ఒకటే చెబుతాయి. మనం ఆగిపోకపోతే ఎత్తు పల్లాలు మనల్ని ఆపలేవు

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలి



హ్యూమన్ రైట్స్ గ్లోబల్ మిషన్ సొసైటీ ప్రకాశం జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

జిల్లా అధ్యక్షుడిగా రావి బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా రావి శ్రీకాంత్‌కు బాధ్యతలు

గుంతకల్లు నవంబర్ 12 తెలుగుకలం : సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తూ,బాధితులకు అండగా నిలిచి వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని హ్యూమన్ రైట్స్ గ్లోబల్ మిషన్ సొసైటీ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. సంస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు న్యాయపరమైన సహకారం అందించడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లాలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.రెండు రోజుల ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా సంస్థ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గుత్తా భాస్కర నాయుడు,స్టేట్ మీడియా సెక్రటరీ ఖాజావలి అద్దంకి మండలం కుంకుపాడు గ్రామాన్ని సందర్శించారు.అక్కడ ఓ పాలం సమస్యకు సంబందించి బాధితులతో మాట్లాడి సమస్య వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని భరోసా కల్పించారు.అనంతరం కొరిసపాడు మండలం దైవాల రావూరు గ్రామానికి చెందిన రావి బాలకృష్ణను ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా, రావి శ్రీకాంత్‌ను జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా హ్యూమన్ రైట్స్ గ్లోబల్ మిషన్ సొసైటీ చైర్మన్ కాకర్ల సరస్వతి నియమించారు.నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు జిల్లాలో సంస్థ కార్యకలాపాలను విస్తరించి,ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గుత్తా భాస్కర నాయుడు మాట్లాడుతూ... మానవ హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు, బలహీన వర్గాలు,అన్యాయానికి గురైన బాధితులకు అండగా నిలవడమే సంస్థ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.కేవలం పదవులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. ప్రజల నమ్మకాన్ని పొందే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.స్టేట్ మీడియా సెక్రటరీ ఖాజావలి మాట్లాడుతూ.... నేటి సమాజంలో అనేక మంది తమకు జరిగిన అన్యాయంపై ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటి వారికి మానవ హక్కుల సంస్థ ఒక నమ్మకమైన వేదికగా నిలవాలన్నారు. బాధితుల గొంతుకగా మారి,వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు తోడుగా ఉంటామని తెలిపారు.ప్రకాశం జిల్లాలో నూతన కమిటీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సంస్థ సేవలను గ్రామగ్రామాన విస్తరించి,ప్రజల్లో మానవ హక్కులపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన రావి బాలకృష్ణ,రావి శ్రీకాంత్‌లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంస్థ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గుత్తా భాస్కర నాయుడు,స్టేట్ మీడియా సెక్రటరీ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ నియామకంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సైలెంట్ కిల్లర్ ప్రాణాలు తీస్తుంది వేసవిలో మీ గుండె జర భద్రం ఎందుకంటే

శీతాకాలంలోనే కాదు, వేసవిలో కూడా గుండె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. గుండెపోటు ప్రమాదం వేసవిలో ఎంత ఉంటుందో శీతాకాలంలో కూడా అంతే ఉంటుంది. కాబట్టి, ఇప్పటికే గుండె రోగులుగా ఉన్నవారు వేసవిలో కూడా తమ గుండె ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవిలో గుండెపై ఎక్కువ ఒత్తిడి కలిగేలా ఎలాంటి పనులు చేయకూడదు.. ఇది కాకుండా, వేసవిలో గుండెపోటు కేసులు.. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇంకా ఏమి చేయాలి.. నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకోండి.. వేసవిలో ఎక్కువసేపు ఎండలో ఉండి కష్టపడి పనిచేసే వారికి గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.. చిన్న నిర్లక్ష్యం కారణంగా మిమ్మల్ని ఆసుపత్రిలో చేర్చే ప్రమాదం ఉంది. అందువల్ల, వేసవితోపాటు శీతాకాలంలో గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. వేసవిలో మీ ఆహారం, జీవనశైలిలో స్వల్ప మార్పులు చేయడం ద్వారా, మీరు మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. శీతాకాలంలో గుండె ధమనులు ప్రభావితమైనట్లే, వేసవిలో కూడా అవే ప్రభావితమవుతాయి. రెండింటికీ కారణాలు ఖచ్చితంగా భిన్నంగా ఉన్నప్పటికీ.. గుండె సమస్యలు మాత్రం పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.. కాబట్టి, వేసవిలో కూడా గుండె ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచిస్తున్నారు.

వేసవిలో పెరుగుతున్న గుండె సమస్యలు.. నిపుణులు ఏం చెబుతున్నారంటే..

వేసవిలో ఎక్కువసేపు ఎండలో ఉండటం గుండె ఆరోగ్యానికి మంచిది కాదని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సునీల్ కత్యాల్ అంటున్నారు. ఇది మీ శరీరాన్ని వేడి చేస్తుంది.. ఈ పరిస్థితుల్లో శరీరాన్ని చల్లగా ఉంచడానికి, శరీరంలోని అన్ని భాగాలకు రక్తాన్ని సరఫరా చేయడానికి గుండె ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. అంటే గుండె వేగంగా కొట్టుకుటుంది.. దీనివల్ల గుండెపై మరింత భారం పెరుగుతుంది. ఇది కాకుండా, మీరు ఎక్కువగా పని చేస్తే, మీకు చెమట ఎక్కువగా పడుతుంది.. దీంతో మీరు డీహైడ్రేషన్ బాధితుడిగా కూడా మారవచ్చు. అలాంటి పరిస్థితులలో గుండెపై ఒత్తిడి కూడా పెరుగుతుంది. దీని కారణంగా, గుండె రోగులకు ఆంజినా (ఛాతీలో నొప్పి, ఒత్తిడి లేదా బిగుతుగా అనిపించే అనుభూతి), గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల, మీ శరీరం వేడెక్కకుండా కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ఎక్కువ వ్యాయామం లేదా పని చేయడం ప్రమాదకరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.



మీ హృదయాన్ని జాగ్రత్తగా చూసుకోండి..

వేసవిలో మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం ద్వారా మంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. దీని కోసం, ఎక్కువసేపు ఎండలో ఉండకండి.. మీ ఆహారాన్ని మార్చుకోండి. వేసవిలో చాలా తేలికైన, సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తినాలి. ఆహారంలో ఎక్కువ ద్రవ పదార్థాలు ఉండాలి. కాలానుగుణ పండ్లను తినడం ద్వారా కూడా మీరు హైడ్రేటెడ్‌గా ఉండగలరు.

మద్యం ధూమపానం నుండి దూరంగా ఉండండి

దీనితో పాటు, ఎండాకాలంలో మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.. మద్యం %-% పొగాకు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఎండలో చల్లగా ఉండటానికి ప్రయత్నించండి. దీనితో పాటు, ఒత్తిడికి దూరంగా ఉండండి. కొన్ని సందర్భాల్లో ఛాతీలో అసౌకర్యం, నొప్పి.. తీవ్ర అలసట..

అరటి కాండంలో దాగిన ఆరోగ్య రహస్యం.. కిడ్నీ వ్యాధులున్న వారికి ఇది దివ్యౌషధం



అరటి కాండం జీర్ణక్రియ, మూత్రపిండాల ఆరోగ్యం, బరువు నిర్వహణ, రక్తపోటు నియంత్రణకు అద్భుతమైన ఆహారం. ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్స్ కలిగి వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రోజువారీ ఆహారంలో చేర్చడం ఎంతో ప్రయోజనకరం. మొండి వ్యాధులను సైతం తరిమికొట్టేయగల శక్తి దీనికుంది. పలు రకాల ఆరోగ్య సమస్యలకు దీంతో చెక్ పెట్టేయొచ్చు. ఏ సమస్యలకు ఇది ఎలా పనిచేస్తుందో తెలుసుకుందాం.. వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహజంగా దొరికే ఆహార పదార్థాలు కీలక పాత్ర పోషిస్తాయి. అరటి కాండం అటువంటి ఆరోగ్య గని. ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉన్న ఈ పదార్థం జీర్ణక్రియ, మూత్రపిండాల ఆరోగ్యం, బరువు నిర్వహణకు అద్భుతంగా తోడ్పడుతుంది. సులభంగా లభించే ఈ ఆహారాన్ని రోజువారీ జీవనంలో చేర్చి శరీరాన్ని ఉత్తేజపరుచుకోండి.

పోషక విలువలు

అరటి కాండం నీటి శాతం (95%) ఎక్కువగా కలిగి తక్కువ కేలరీలు (100 గ్రా.కు 30 కేలరీలు) అందిస్తుంది. ఫైబర్ (1.5-2 గ్రా./100 గ్రా.), పొటాషియం (300-400 మి.గ్రా.), విటమిన్ బి6, విటమిన్ సి సమృద్ధిగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్స్, ఖనిజాలు కలిగి శరీర ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

జీర్ణక్రియకు సహాయం

అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నివారిస్తుంది. గట్ బ్యాక్టీరియా సమతుల్యం చేస్తుంది. కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో చేర్చడం జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

మూత్రపిండాల ఆరోగ్యం

పొటాషియం, నీటి శాతం అధికంగా ఉండటం మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. కిడ్నీ స్టోన్స్ నివారణకు సహాయపడుతుంది. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగిస్తుంది. మూత్ర మార్గ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రసం రూపంలో తీసుకోవడం ఈ ప్రయోజనాలను పెంచుతుంది.

బరువు నిర్వహణ

తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ కలిగి బరువు తగ్గడానికి అనువైనది. ఆకలిని నియంత్రిస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తుంది. ఆహారంలో సలాడ్‌గా, కూరగా చేర్చడం ప్రయోజనకరం.

రక్తపోటు నియంత్రణ

పొటాషియం రక్త నాళాలను సడలించి రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. యాంటీఆక్సిడెంట్స్ శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. రోజువారీ తీసుకోవడం హైపర్‌టెన్షన్‌ను నియంత్రిస్తుంది.

ఉపయోగించే విధానాలు

అరటి కాండాన్ని కూరగా, సలాడ్‌గా, రసంగా తీసుకోవచ్చు. రసం తయారీకి కాండాన్ని సన్నగా తరిగి, నీటితో కలిపి జ్యూసర్‌లో వేయండి. కొద్దిగా నిమ్మరసం, ఉప్పు కలపడం రుచిని పెంచుతుంది. కూరలో ఉల్లిపాయలు, మసాలాలతో కలిపి వండవచ్చు.

వామ్మో ఏనుగు కలలో కనిపించిందా త్వరలో మీకు జరిగేది ఇదేనట





సాధారణంగానే మనందరికీ కలలు రావటం సహజం. అయితే, కొందరికీ కలలో పర్వతాలు .. నదులు .. అడవులు .. జంతువులు కనిపిస్తుంటాయి. అలాంటి కలల్లో అప్పుడప్పుడు పులులు .. సింహాలు, ఏనుగులు కూడా కనిపిస్తుంటాయి. అలాంటి జంతువులు కలలో కనిపించినప్పుడు సాధారణంగానే భయపడుతుంటారు. కొందరు ఆ కలను మరుసటి రోజు ఉదయం ఇతరులతో పంచుకుంటారు. మరికొందరు ఎదుటివారికి చెబితే ఏం జరుగుతుందోననే ఆందోళనకి లోనవుతుంటారు. అయితే కలలో ఏనుగు కనిపిస్తే ఏమౌతుందో తెలుసా..? స్వప్న శాస్త్రం ప్రకారం, కలలు అనేది కొన్ని సంకేతాలను తెలియజేస్తాని చెబుతారు. ఆయా కల ఆధారంగా మంచి, చెడు అంచనా వేస్తారు. కొందరికి కలలో ఏనుగు తరచుగా కనిపిస్తుంది. అయితే మీకు కలలో ఏనుగు వస్తే, మీ దశ తిరగనుందని అర్థం అంటున్నారు జ్యోతిశాస్త్ర నిపుణులు. మీరు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలన్నీ తొలగిపోతాయని అంటున్నారు. స్వప్న శాస్త్రం ప్రకారం, కలలు అనేది కొన్ని సంకేతాలను తెలియజేస్తాని చెబుతారు. ఆయా కల ఆధారంగా మంచి, చెడు అంచనా వేస్తారు. కొందరికి కలలో ఏనుగు తరచుగా కనిపిస్తుంది. అయితే మీకు కలలో ఏనుగు వస్తే, మీ దశ తిరగనుందని అర్థం అంటున్నారు జ్యోతిశాస్త్ర నిపుణులు. మీరు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలన్నీ తొలగిపోతాయని అంటున్నారు.

1 / 5

కలలో ఏనుగు కనిపించటంతో ఏదో విధంగా మీకు ధనలాభం గోచరిస్తుందని అర్థం అంటున్నారు నిపుణులు. ఇలాంటి కలలు రావటం అంటే మీరు త్వరగా ధనవంతులు కాబోతున్నారని సంకేతం అంటున్నారు. లేదా మీకు ఎలాంటి ఆర్థిక సమస్యలు ఉండవని ముందుగా మీకు అందుతున్న శుభ సంకేతం అంటున్నారు. కలలో ఏనుగు కనిపించటంతో ఏదో విధంగా మీకు ధనలాభం గోచరిస్తుందని అర్థం అంటున్నారు నిపుణులు. ఇలాంటి కలలు రావటం అంటే మీరు త్వరగా ధనవంతులు కాబోతున్నారని సంకేతం అంటున్నారు. లేదా మీకు ఎలాంటి ఆర్థిక సమస్యలు ఉండవని ముందుగా మీకు అందుతున్న శుభ సంకేతం అంటున్నారు.

2 / 5

కలలో ఏనుగు కనిపిస్తే మంచిదేనని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏనుగు కుంభస్థలం .. లక్ష్మీదేవి నివాస స్థానంగా చెబుతారు. అందువలన కలలో ఏనుగు దర్శనం వలన సంపదలు లభిస్తాయని అంటారు. ఏనుగును దర్శించుకోవడం వలన దారిద్ర్యం .. దుఃఖం దూరమవుతాయని జ్యోతిశాస్త్ర నిపుణులు చెబుతున్నారు.



కలలో ఏనుగు కనిపిస్తే మంచిదేనని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏనుగు కుంభస్థలం .. లక్ష్మీదేవి నివాస స్థానంగా చెబుతారు. అందువలన కలలో ఏనుగు దర్శనం వలన సంపదలు లభిస్తాయని అంటారు. ఏనుగును దర్శించుకోవడం వలన దారిద్ర్యం .. దుఃఖం దూరమవుతాయని జ్యోతిశాస్త్ర నిపుణులు చెబుతున్నారు.

3 / 5

కలలో ఏనుగు కనిపించటం వల్ల వారి జీవితంలో శుభఫలితాలు కలుగుతాయని అంటున్నారు. వారికి జీవితలో అదృష్టం, ఐశ్వర్యం చేకూరతాయని నమ్ముతారు. అంతేకాదు.. ఏనుగును గజరాజు అంటారు. ఆ సాక్ష్యాత్తు ఆ వినాయకుడి ముఖం కూడా ఏనుగు. అందుకే కలలో ఏనుగు కనిపిస్తే అదృష్టంగా చెబుతారు. కలలో ఏనుగు కనిపించటం వల్ల వారి జీవితంలో శుభఫలితాలు కలుగుతాయని అంటున్నారు. వారికి జీవితలో అదృష్టం, ఐశ్వర్యం చేకూరతాయని నమ్ముతారు. అంతేకాదు.. ఏనుగును గజరాజు అంటారు. ఆ సాక్ష్యాత్తు ఆ వినాయకుడి ముఖం కూడా ఏనుగు. అందుకే కలలో ఏనుగు కనిపిస్తే అదృష్టంగా చెబుతారు.

4 / 5

అంతేకాదు.. ఆయా పుణ్య క్షేత్రాల్లో గజ వాహనంగా ఏనుగులు భగవంతుడి సేవలో తరిస్తుంటాయి. గజ ముఖంతోనే వినాయకుడు తొలి పూజలు అందుకుంటూ ఉంటాడు .. అందరి విఘ్నాలను తొలగిస్తూ ఉంటాడు. అలాంటి ఏనుగును కలలోనే కాదు .. బయట చూసినా ఆ ఇంటిల్లిపాదికి మంచి జరుగుతుందని నమ్ముతారు. అంతేకాదు.. ఆయా పుణ్య క్షేత్రాల్లో గజ వాహనంగా ఏనుగులు భగవంతుడి సేవలో తరిస్తుంటాయి. గజ ముఖంతోనే వినాయకుడు తొలి పూజలు అందుకుంటూ ఉంటాడు .. అందరి విఘ్నాలను తొలగిస్తూ ఉంటాడు. అలాంటి ఏనుగును కలలోనే కాదు .. బయట చూసినా ఆ ఇంటిల్లిపాదికి మంచి జరుగుతుందని నమ్ముతారు.వామ్మో.. ఏనుగు కలలో కనిపించిందా..? త్వరలో మీకు జరిగేది ఇదేనట..!

రేషన్ కార్డులు ఉన్నవారికి గుడ్ న్యూస్.. రాయితీపై నిత్యావసర వస్తువులు..!



నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వం రాయితీపై నిత్యావసర వస్తువులు అందించాలని భావిస్తున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణలో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యంతో పాటు, మరో ఆరు రకాల నిత్యావసర సరుకులను అందించేందుకు కసరత్తు చేస్తోంది. సన్న బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, పంచదార, చింతపండు, కారంపొడి ఇచ్చేందుకు ప్లాన్ చేస్తోంది. ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరో పక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు రాయితీపై నిత్యావసర వస్తువులు అందించనుంది.క్రిస్మస్, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకుని రేషన్ షాపుల ద్వారా కార్డులు ఉన్నవారికి కిలో కందిపప్పు రూ.100, గోధుమపిండి రూ.25, లీటరు పామాయిల్ రూ.125 చొప్పున త్వరలో అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం తక్కువ ధరకే సన్న బియ్యం విక్రయిస్తోంది. సీఎం చంద్రబాబు నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, రాయితీపై ప్రజలకు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ వేసి నిర్ణయం కూడా తీసుకున్నారు. డిసెంబర్ నెల నుంచి మూడు నెలలపాటు రాయితీపై నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రేపటి నుంచి కొత్త పింఛన్ల పంపిణీ.. 4.5 లక్షల మందికి లబ్ధి..! ఈ వస్తువులు రాయితీ ఇవ్వడం వల్ల ప్రభుత్వం నెలకు రూ.100.20 కోట్ల భారం పడనుంది. మూడు నెలలకు రూ.300.60 కోట్లు రాయితీ భారాన్ని భరించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ధరల స్థిరీకరణ నిధి కింద 1.20 లక్షల టన్నుల కందులు కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. కేంద్రం ఈ మేరకు 40,338 టన్నులు కేటాయించింది. ముడికందుల లభ్యతకు అనుగుణంగా సేకరణతో పాటుగా పప్పు తయారీ ఒప్పందాలు చేసుకోవాలని పౌరసరఫరాల సంస్థ ఎండీ, వీసీని పౌరసరఫరాలశాఖ కమిషనర్ కన్నబాబు ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే పామాయిల్ సేకరించాలని, మూడు నెలల తర్వాత రాయితీపై నిత్యావసర వస్తువులు అందించే కార్యక్రమాన్ని పొడిగించాల్సి వస్తే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని ఉత్తర్వుల్లో వివరించారు. సరకులపై రాయితీకి ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా. తెలంగాణ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

రాష్ట్రంలో 13 హైటెక్ బస్టాండ్లు.. మోడల్ బస్టాండ్లుగా మరో 86..!



తెలంగాణలోని ఆర్టీసీ బస్టాండ్లకు కొత్త కల రానుంది. కార్పొరేట్ లుక్‌లో మోడల్ బస్టాండ్లుగా మార్చనున్నారు. వినోదానికి, షాపింగ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా 13 హైటెక్ బస్టాండ్లను తీర్చిదిద్దనున్నారు. ఎయిర్‌పోర్ట్ స్థాయి సదుపాయాలతో వీటిని తీర్చిదిద్దబోతున్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం, టీజీఎన్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి వినూత్న ఆలోచనతో రూపొందించిన ఈ బృహత్తర ప్రాజెక్టుకు ప్రభుత్వం, రవాణా శాఖల నుంచి ఇప్పటికే అధికారిక అనుమతులు లభించినట్లు సమాచారం. అలాగే పలు చోట్లు కొత్త బస్ టెర్మినళ్లు నిర్మించనున్నారు. నూతనంగా నిర్మించే బస్ స్టేషన్లు మల్టీ-మోడల్ కనెక్టివిటీ ఉండే విధంగా నిర్మించనున్నారు. బస్సు దిగగానే రైల్వే లేదా ఇతర రవాణా సాధనాలను సులభంగా చేరుకునే సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. స్థానిక, ప్రముఖ వ్యాపారులు తమ బిజినెస్ విస్తరణ కోసం వాణిజ్య సముదాయాలు (కమర్షియల్ స్పేస్). ప్రయాణికులు వేచి ఉండే సమయంలో ఆహ్లాదాన్ని పంచే గేమింగ్, ఫుడ్ కోర్టులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ నూతన హైటెక్ బస్టాండ్లలో షాపులు, బిజినెస్ కాంప్లెక్స్‌ల కేటాయింపు కోసం ఆసక్తిగల వ్యాపారులు ఆర్టీసీ యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని సంస్థ ప్రకటించింది. నూతన బస్ స్టేషన్లు ఏర్పాటు కానున్న 13 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్ నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం వీటిని ఏర్పాటు చేయనున్నారు. గుడ్ న్యూస్.. నేటి నుంచి కొత్త పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ..! ఆర్టీసీ తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రయాణికులకు రవాణా మరింత సులభతరం కావడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణ ప్రాంగణాలు ఆధునిక హంగులతో కొత్త కళను సంతరించుకోనున్నాయి. అలాగే రోజుకు 5 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే 86 రద్దీ బస్ స్టేషన్లను గుర్తించి, వాటిని 'మోడల్ బస్ స్టేషన్లు'గా తీర్చిదిద్దనున్నారు. ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం అందించడం, నిరంతర పర్యవేక్షణ, విచారణ విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. ప్రత్యేక స్టేషన్ కంట్రోలర్లు ఇ ఎంక్వైరీ: గుర్తించిన 86 బస్టాండ్లలో ఒక్కో విభాగానికి ప్రత్యేక స్టేషన్ కంట్రోలర్‌ను నియమించారు. ప్రయాణికులు బస్సుల సమాచారాన్ని సులువుగా తెలుసుకునేందుకు ప్రత్యేక ఎంక్వైరీ కౌంటర్లు, సంప్రదింపుల కోసం కాంటాక్ట్ నంబర్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికులు తమ ప్రయాణాలను సులభంగా ప్లాన్ చేసుకునేలా స్పష్టమైన బస్సు వేళలతో కూడిన నూతన టైమ్‌టేబుల్ బోర్డులను స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

కాగ్నిజెంట్ లో 15 వేల ఉద్యోగాలకు ఎసరు.. ఇండియాలోనే అధికం..!



ఐటీ ఉద్యోగల మెడపై లే ఆఫ్స్ కత్తి వేలాడుతోంది. ఎప్పుడు ఉద్యోగాలు పోతాయోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఐ భారీగా ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని నివేదికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ మరోసారి లే ఆఫ్స్ చేపట్టే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. కాగ్నిజెంట్ ప్రపంచవ్యాప్తంగా 15,000 మంది ఉద్యోగులపై ప్రభావం చూపే భారీ పునర్వ్యవస్థీకరణను పరిశీలిస్తుందని సమాచారం. కాగ్నిజెంట్ ప్రపంచవ్యాప్తంగా 12,000 నుంచి 15,000 మంది ఉద్యోగులపై ప్రభావం చూపేలా ఉద్యోగ కోతలను పరిశీలిస్తోంది. దీని ప్రభావం ప్రధానంగా భారతదేశంలోనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. కార్యకలాపాలను సరళీకృతం చేయడం, ఏఐ-ఆధారిత వ్యాపార నమూనా వైపు మారడం లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీ పునర్‌వ్యవస్థీకరణ కార్యక్రమం 'ప్రాజెక్ట్ లీప్'లో భాగంగా తొలగింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం కింద ఉద్యోగ విరమణ, ఇతర ఉద్యోగి సంబంధిత ఖర్చుల కోసం వి200 మిలియన్ల నుంచి వి270 మిలియన్ల వరకు సహా, వి230 మిలియన్ల నుంచి వి320 మిలియన్ల వరకు పునర్‌వ్యవస్థీకరణ ఖర్చులు అవుతాయని కాగ్నిజెంట్ ప్రకటించింది. ఈ కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా 357,000 మందికి పైగా ఉద్యోగులు ఉండగా, వారిలో 250,000 మందికి పైగా భారతదేశంలోనే ఉన్నారు. శ్రీంశీ =ముఒ భారత ఐటీ ఉద్యోగాలు: ఏఐ దెబ్బకు షాక్.. కానీ ఈ డీల్ జాక్‌పాట్! క్లయింట్లు అధిక ఉత్పాదకత, ఆటోమేషన్‌ను కోరుతున్నందున, ఐటీ సేవల కంపెనీలు సాంప్రదాయ శ్రమ-కేంద్రీకృత సిబ్బంది నమూనాలకు క్రమంగా దూరమవుతున్నాయి. అయితే 12,000-15,000 ఉద్యోగాల కోతకు సంబంధించిన వార్తలను కాగ్నిజెంట్ అధికారికంగా ధృవీకరించలేదు. తమ ఏఐ వ్యూహానికి అనుగుణంగా ఉండే ప్రతిభ కోసం ఉద్యోగులకు క్రాస్-ట్రైనింగ్, రీస్కిల్లింగ్ ఇవ్వడంపై దృష్టి సారిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ప్రాజెక్ట్ లీప్ 2027 మార్చి నాటికి ముగియనుంది. తమ ఉద్యోగుల కూర్పును పునర్‌వ్యవస్థీకరిస్తున్నప్పటికీ, కొత్త గ్రాడ్యుయేట్లు, అనుభవజ్ఞులైన నిపుణులను నియమించుకోవడం కొనసాగిస్తామని కాగ్నిజెంట్ పేర్కొంది. ఇదిలా ఉండగా అమెరికాకు చెందిన సెమీకండక్టర్ దిగ్గజం క్వాల్‌కామ్ తన ప్రపంచవ్యాప్త ఉద్యోగుల కోతలో భాగంగా భారతదేశంలో ఉద్యోగులను తొలగించడం ప్రారంభించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్, మారుతున్న మార్కెట్ పరిస్థితుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో టెక్నాలజీ కంపెనీలపై తమ కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించుకోవడానికి, సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి, మారుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా మారడానికి పెరుగుతున్న ఒత్తిడిని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశంలో మొదటి విడత తొలగింపులు కంపెనీ బెంగళూరు కేంద్రంలో ప్రారంభమైనట్లు సమాచారం. దశలవారీగా దాని కార్యకలాపాలన్నింటిలో మరిన్ని కోతలు ఉంటాయని భావిస్తున్నారు. నివేదికల ప్రకారం భారతదేశంలో సుమారు 1,000 లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు ప్రమాదంలో పడవచ్చని తెలుస్తోంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి తగ్గిన పెట్టుబడులు..!



మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ అక్టోబర్ లో రూ. 1.74 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో నికర పెట్టుబడులు నెలవారీగా దాదాపు 14 శాతం తగ్గి రూ. 38,307 కోట్ల నుంచి రూ. 32,994 కోట్లకు పడిపోయాయి. సెప్టెంబర్‌లోని రూ. 38,306.55 కోట్ల నుంచి నికర పెట్టుబడుల ప్రవాహం 13.9 శాతం తగ్గి రూ. 32,993.64 కోట్లకు పడిపోయినప్పటికీ, అక్టోబర్‌లో కూడా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఆకర్షించడం కొనసాగించాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా విడుదల చేసిన తాజా డేటా ప్రకారం ఈక్విటీ ఫండ్ ఏయూఎం కూడా గత నెలలోని రూ. 37.54 లక్షల కోట్ల నుంచి రూ. 37.15 లక్షల కోట్లకు పడిపోయింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ ఏయూఎం తగ్గుదలకు ప్రతికూల మార్క్-టు-మార్కెట్ కదలికలే కారణమని ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని పేర్కొన్నారు. ఈ విభాగంలో సానుకూల నికర పెట్టుబడుల ప్రవాహం నమోదైనప్పటికీ, ఈక్విటీ ఏయూఎం నెలవారీగా దాదాపు రూ. 39,724 కోట్లు లేదా 1.1 శాతం తగ్గింది. అక్టోబరు నెలలో ఈక్విటీ విభాగాల్లో 'లార్జ్ అండ్ మిడ్-క్యాప్' ఫండ్లు అత్యధికంగా రూ. 8,484.23 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ఇది సెప్టెంబరులో నమోదైన రూ. 4,271.22 కోట్లతో పోలిస్తే దాదాపు రెట్టింపుగా ఉంది. ఆ తర్వాతి స్థానంలో స్మాల్-క్యాప్ ఫండ్లు రూ. 6,407.50 కోట్ల పెట్టుబడులను పొందాయి . అక్టోబర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ డిఫెన్స్ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసిన స్టాక్స్ ఇవే..! మిడ్-క్యాప్ ఫండ్లలో పెట్టుబడులు సెప్టెంబరులోని రూ. 7,834.84 కోట్ల నుంచి రూ. 4,892.62 కోట్లకు తగ్గాయి. ఫ్లెక్సీ-క్యాప్ ఫండ్లు రూ. 4,979.95 కోట్లను పొందగా, లార్జ్-క్యాప్ ఫండ్లలో పెట్టుబడులు సెప్టెంబరులోని రూ. 859.47 కోట్ల నుండి రూ. 1,032.39 కోట్లకు పెరిగాయి. కాంట్రా ఫండ్లు కూడా తిరిగి సానుకూల ధోరణిలోకి వచ్చి, రూ. 1,694.13 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. సెప్టెంబరులో వీటి నుంచి రూ. 97.88 కోట్ల నిధులు బయటకు వెళ్లాయి. డెట్ మ్యూచువల్ ఫండ్లలో అక్టోబరు నెలలో రూ. 1,13,437.89 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబరులో వీటి నుంచి రూ. 1,83,155.76 కోట్ల నికర నిధులు బయటకు వెళ్లాయి. నెలవారీగా చూస్తే, దాదాపు రూ. 2.97 లక్షల కోట్ల వ్యత్యాసం నమోదైంది. డెట్ ఫండ్ల నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ కూడా సెప్టెంబరులోని రూ. 17.64 లక్షల కోట్ల నుంచి అక్టోబరులో రూ. 18.81 లక్షల కోట్లకు పెరిగింది. డెట్ ఫండ్లలో వచ్చిన ఈ పునరుద్ధరణే, మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ కోలుకోవడానికి ప్రధాన కారణమైంది. అక్టోబరు నెలలో లిక్విడ్ ఫండ్లలోకి రూ. 70,533.75 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబరులో వీటి నుంచి రూ. 95,743.20 కోట్లు బయటకు వెళ్లగా, ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అలాగే ఓవర్‌నైట్ ఫండ్లు కూడా తిరిగి సానుకూల స్థితికి చేరుకున్నాయి. గత నెలలో వీటి నుంచి రూ. 7,281.20 కోట్లు బయటకు వెళ్లగా ఈసారి రూ. 54,893.05 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

అక్టోబర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ డిఫెన్స్ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసిన స్టాక్స్ ఇవే..!



యాక్టివ్ ఫండ్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ డిఫెన్స్ మ్యూచువల్ ఫండ్ 2026 అక్టోబర్ లో తన పోర్ట్‌ఫోలియోను పునర్‌వ్యవస్థీకరించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న ఐదు స్టాక్‌లలో తన వాటాలను పెంచుకోవడంతో పాటు, మూడు కొత్త స్టాక్‌లను చేర్చింది. ఈ చేర్పులతో అక్టోబర్ చివరి నాటికి ఫండ్ మొత్తం పోర్ట్‌ఫోలియో 27 స్టాక్‌లకు విస్తరించింది. హెచ్‌డీఎఫ్‌సీ డిఫెన్స్ ఫండ్ భారతదేశంలో ఉన్న ఏకైక ఓపెన్-ఎండెడ్ డిఫెన్స్ థీమాటిక్ స్కీమ్. ఇది ప్రధానంగా రక్షణ, అనుబంధ రంగాలలో పనిచేస్తున్న కంపెనీల ఈక్విటీలలో పెట్టుబడి పెడుతుంది. ఏరోస్పేస్, రక్షణ, ఆటో విడిభాగాలు, రసాయనాలు, పెట్రోకెమికల్స్, పారిశ్రామిక తయారీ, ఇతర సంబంధిత పరిశ్రమల వంటి విభాగాలలో చురుకుగా పెట్టుబడి పెట్టే వెసులుబాటు ఫండ్ మేనేజర్‌కు ఉంది. 2026 సెప్టెంబర్ 30 నాటికి ఫండ్ యొక్క నిర్వహణలో ఉన్న ఆస్తులు 11,493 కోట్లుగా ఉండగా.. 2026 అక్టోబర్ 31 నాటికి అవి రూ.11,131 కోట్లకు తగ్గాయి. 2026 నవంబర్ 9 నాటికి, హెచ్‌డీఎఫ్‌సీ డిఫెన్స్ ఫండ్ ఒక సంవత్సరంలో 21.04% రాబడిని అందించింది. ఇది 14.19% రాబడిని ఇచ్చిన దాని బెంచ్‌మార్క్ నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ని అధిగమించింది. అయితే, మూడు సంవత్సరాల కాలంలో ఫండ్ రాబడి 34.08 శాతం రాబడి ఇచ్చింది. ఇది బెంచ్‌మార్క్ 39.70% కంటే తక్కువ. 30 సెప్టెంబర్, 31 అక్టోబర్ 2026 మధ్య ఫండ్ హోల్డింగ్స్ ఎలా మారాయో చూద్దాం. 10 ఏళ్లలో అత్యధిక రాబడి అందించిన స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు ఇవే..! ఫండ్ హోల్డింగ్స్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్ అతిపెద్ద పెరుగుదలను నమోదు చేసింది. దీని వాటా సెప్టెంబర్‌లోని 440 లక్షల షేర్ల నుంచి అక్టోబర్ 2026 నాటికి 470.18 లక్షల షేర్లకు, అంటే 30.18 లక్షల షేర్లు పెరిగింది. హెచ్‌డిఎఫ్‌సి డిఫెన్స్ ఫండ్ కూడా టాటా మోటార్స్‌లో తన వాటాను 1.42 లక్షల షేర్లు పెంచుకుని, మొత్తం వాటాను 30.46 లక్షల షేర్లకు చేర్చింది. బిఇఎంఎల్‌లో దీని వాటా 30.11 లక్షల షేర్లకు పెరగ్గా, భారత్ ఫోర్జ్‌లో వాటా 77.51 లక్షల షేర్లకు పెరిగింది. బోష్‌లో కూడా వాటా 0.13 లక్షల షేర్లు పెరిగి 1.13 లక్షల షేర్లకు చేరింది. కొత్తగా చేరిన వాటిలో, టొన్బో ఇమేజింగ్ ఇండియా 14.54 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, దాని తర్వాతి స్థానంలో బాన్బ్రిగ్లియోలి ట్రాన్స్మిషన్స్ 4.55 లక్షల షేర్లతో ఉన్నాయి. పీటీసీ ఇండస్ట్రీస్ వాటా 0.24 లక్షల షేర్లుగా ఉంది. అక్టోబర్‌లో హెచ్‌డిఎఫ్‌సి డిఫెన్స్ ఫండ్ ఏ స్టాక్‌లోని తన హోల్డింగ్స్‌ను తగ్గించలేదు లేదా పూర్తిగా విక్రయించలేదు. వీటిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ 46.61 లక్షల షేర్లతో తన హోల్డింగ్స్‌లో ఎలాంటి మార్పు లేకుండా అతిపెద్దదిగా నిలిచింది. దాని తర్వాత ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ 45.23 లక్షల షేర్లతో, సైయంట్ డీఎల్ఎం 40 లక్షల షేర్లతో ఉన్నాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ ఫండ్ అతిపెద్ద పోర్ట్‌ఫోలియో హోల్డింగ్‌గా కొనసాగింది. ఇది దాని నికర ఆస్తి విలువ లో 15.63% వాటాను కలిగి ఉంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్, భారత్ ఫోర్జ్ తర్వాతి రెండు అతిపెద్ద హోల్డింగ్స్‌గా ఉన్నాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

భారత ఐటీ ఉద్యోగాలు ఏఐ దెబ్బకు షాక్.. కానీ ఈ డీల్ జాక్‌పాట్!



ఏఐ టెక్నాలజీ దెబ్బకు టెక్ పరిశ్రమ మొత్తం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న వేళ, భారత ఐటీ ఉద్యోగులకు యాక్సెంచర్ రూపంలో ఓ జాక్‌పాట్ తగిలింది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ 'క్వాంటాస్' ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఏవియేషన్, పర్యాటక రంగాల్లో ఏఐ టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, తమ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవాలని, వ్యాపారాన్ని పునర్‌వ్యవస్థీకరించాలని భావిస్తోంది. ఈ ముఖ్యమైన ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టును అవుట్‌సోర్స్ చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు క్వాంటాస్ తన టెక్ పనుల్లో చాలా వరకు సొంతంగానే (ఇన్-హౌస్) చేసుకునేది. కానీ ఇప్పుడు ఆ పనులను అవుట్‌సోర్సింగ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇండియాలో టెక్ ఉద్యోగులకు మరో బిగ్ షాక్.. క్వాల్‌కామ్‌లో వెయ్యి మందికి పైగా ఉద్యోగులపై వేటు.. ఇందుకోసం క్వాంటాస్, యాక్సెంచర్ మధ్య పలు సంవత్సరాల ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం 850 మంది ఉద్యోగుల పనులను అవుట్‌సోర్స్ చేయనున్నారు. ఈ పనుల్లో అధిక భాగం భారత్ నుంచే నిర్వహించనుండటం విశేషం. ఈ నిర్ణయంతో యాక్సెంచర్ ఇండియా ఆఫీసులో కొత్త ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగనున్నాయి. మరోవైపు, క్వాంటాస్ సీఈఓ వెనెస్సా హడ్సన్ తమ ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్‌లో, "ఈ వార్త చాలా మందికి షాకింగ్‌గా, బాధ కలిగించేలా ఉండొచ్చు. కంపెనీలో ఇలాంటి పరిస్థితి వచ్చినందుకు నన్ను క్షమించండి" అని పేర్కొన్నారు. ఐటీ కంపెనీల పని అయిపోయిందా.. కుప్పకూలుతున్న దిగ్గజ కంపెనీల షేర్లు.. కొంపలు ముంచుతున్న ఏఐ "యాక్సెంచర్ మన టెక్నాలజీని మెరుగుపరుస్తుంది. ఈ క్రమంలో ఆదా అయ్యే భారీ మొత్తాన్ని కస్టమర్ సేవలు, భవిష్యత్ వృద్ధి ప్రణాళికలపై పెట్టుబడిగా పెడతాం" అని ఆమె వివరించారు. ఈ అవుట్‌సోర్సింగ్ ద్వారా టెక్నాలజీ, ఏఐ సాయంతో టెక్ డెవలప్‌మెంట్ మరింత వేగవంతం అవుతుందని వెనెస్సా హడ్సన్ తెలిపారు. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది మధ్యలో మొదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొదటి దశలో ఫైనాన్స్, ప్రొక్యూర్‌మెంట్, హెచ్ఆర్, మార్కెటింగ్ వంటి విభాగాల్లోని పనులను యాక్సెంచర్‌కు బదిలీ చేయనున్నారు. ఈ సేవల్లో అధిక భాగం భారత్ నుంచే పొందనున్నట్లు వెనెస్సా హడ్సన్ స్పష్టం చేశారు. అమెరికాను వదిలేస్తారా.. లేక రాజీనామా చేస్తారా.. ఉద్యోగులకు బిగ్ షాకిచ్చిన కారణం ఏంటంటే.. అంతేకాకుండా, ఈ మార్పు వల్ల ఉద్యోగాలు కోల్పోయే వారికి నైపుణ్య శిక్షణ (స్కిల్ డెవలప్‌మెంట్) ఇచ్చి, కంపెనీలోని ఇతర విభాగాల్లో నియమించుకునే అవకాశం కూడా కల్పిస్తామని వెనెస్సా హడ్సన్ హామీ ఇచ్చారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 13 - 11 - 2026



ఇండోనేషియాలో దూసుకుపోతున్న 'రామాయణం'!

దర్శకుడు నితేష్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' ఇండోనేషియాలో దూసుకుపోతుంది. జకార్తాలో జరిగిన ఈ సినిమా ప్రీమియర్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. సాంప్రదాయ భారతీయ దుస్తులు ధరించి ప్రేక్షకులు థియేటర్ల వద్ద సందడి చేసిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు, థాయ్‌లాండ్‌లోనూ ఈ సినిమా జోరు కొనసాగుతోంది. అక్కడ విడుదలైన ఐదు రోజుల్లోనే రూ. 5.15 కోట్లకు పైగా వసూలు చేసి, ఒక భారతీయ చిత్రానికి సంబంధించి రికార్డు సృష్టించింది. బాక్సాఫీస్ రిపోర్టుల ప్రకారం, థాయ్‌లాండ్‌లో నవంబర్ 5న విడుదలైన ఈ చిత్రం సుమారు వి550,000 (సుమారు రూ. 5.15 కోట్లు) రాబట్టింది. ఇక నవంబర్ 11న ఇండోనేషియాలోనూ ఈ చిత్రం ఘనంగా విడుదలైంది. జకార్తాలో జరిగిన ఈ ప్రీమియర్ షో సందర్భంగా అభిమానులు రెడ్ కార్పెట్ పై నడుస్తూ, గాజులు కొనుగోలు చేస్తూ, మెహందీ పెట్టుకుంటూ సందడి చేశారు. రాముడు, సీత, లక్ష్మణుడు, రావణాసురుల వేషధారణలో ఉన్న కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహర్షి వాల్మీకి రామాయణం, అద్భుత రామాయణం అలాగే తులసీదాసి రచించిన రామచరితమానసి ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణాసురుడిగా నటించారు. ఇండోనేషియాలో ప్రాచీన జావానీసి అనువాదమైన 'కకావిన్ రామాయణం' ద్వారా, అలాగే థాయ్‌లాండ్‌లో 'రామకీయన్' రూపంలో ఈ ఇతిహాసానికి ఉన్న గాఢమైన సాంప్రదాయ సంబంధాల వల్ల ఇక్కడ ఈ చిత్రానికి విశేషమైన ఆదరణ లభిస్తోంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం దూసుకుపోతోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లకు పైగా వసూలు చేసింది. భారతదేశంలో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం, డొమెస్టిక్ మార్కెట్‌లో ఆరు రోజుల్లో రూ. 52.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ. 823.50 కోట్ల మార్కును దాటింది. సమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్, యశ్ యొక్క మాస్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో రవి దూబే లక్ష్మణుడిగా నటించారు. కాగా, ఈ చిత్రంలోని పోస్ట్-క్రిడిట్ సీన్‌తో పాటు, సన్నీ డియోల్ హనుమంతుడిగా పరిచయమయ్యే 'హనుమాన్ చాలీసా' మ్యూజిక్ వీడియోను కూడా చిత్ర యూనిట్ విడుదల చేసింది.

'దాదా'లో సింగర్‌గా మారిన బాలయ్య.. 'దాదా ధమాకా'లో నందమూరి నటసింహం స్పెషల్ ట్రీట్!



నందమూరి బాలకృష్ణ అభిమానులకు ఆదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. పరుస విజయాలతో జోరు మీదున్న బాలయ్య.. ఇప్పుడు తన తదుపరి చిత్రం 'దాదా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 24, 2026న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో సినిమా నుంచి విడుదల కానున్న తొలి పాటకు సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో బాలకృష్ణ కేవలం నటించడమే కాకుండా తన గొంతును కూడా వినిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. 'దాదా' సినిమా నుంచి నవంబర్ 13, 2026న తొలి పాట 'దాదా ధమాకా' విడుదల కానుంది. టైటిల్‌కు తగ్గట్టుగానే ఈ పాటను ఫుల్ మాస్ ఎనర్జీతో రూపొందించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ పాటలో బాలకృష్ణ తనదైన స్టైల్‌లో స్టెప్పులు వేయనుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. బాలయ్యతో పాటు బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి కూడా ఈ పాటలో సందడి చేయనున్నారు. నోరా ఫతేహి తన అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె డ్యాన్స్‌కు బాలయ్య మాస్ గ్రేస్ తోడైతే అభిమానులకు పండగే అని చెప్పాలి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న పాట ఎలా ఉండబోతోందనే ఆసక్తి ఇప్పుడు అందరిలోనూ నెలకొంది. నవంబర్ 13న విడుదల కానున్న ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇక ఈ పాటకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. బాలకృష్ణ స్వయంగా కొన్ని లైన్స్ పాడారట. సాధారణంగా తనదైన నటన, డైలాగ్ డెలివరీ, మాస్ యాక్షన్‌తో ప్రేక్షకులను అలరించే బాలయ్య.. ఈసారి గాయకుడిగానూ అభిమానులను సర్‌ప్రైజ్ చేయబోతున్నారు. సినిమాలోని పాట కోసం ఆయన కొన్ని పంక్తులు ఆలపించగా, అప్పటిపుటి విషయంలో చిత్రబృందం సంతోషంగా ఉన్నట్లు సమాచారం.దీంతో బాలకృష్ణ గొంతులో వచ్చే ఆ ప్రత్యేకమైన లైన్స్ వినేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలోనూ పలుపురు స్టార్ హీరోలు తమ సినిమాల్లో పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు బాలయ్య కూడా 'దాదా' కోసం తన గొంతును వినిపించనుండటం ఈ సినిమాకు మరో ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ముఖ్యంగా 'దాదా ధమాకా' పాటలో బాలయ్య పాడిన లైన్స్‌ను హైలైట్ చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పాట విడుదలైన తర్వాత ఈ అంతం అభిమానుల్లో మరింత చర్చనీయాంశమయ్యే అవకాశం ఉంది. !



మెగాస్టార్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్న వశిష్ఠ!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి గత కొంతకాలంగా రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బింబిసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై మొదట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే షూటింగ్, గ్రాఫిక్స్, ఇతర నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత లేకపోవడంతో మగా అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రంలో నటిస్తున్న నటుడు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోతో 'విశ్వంభర' పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వెల్లడైంది. 'విశ్వంభర' సినిమా పరిస్థితి ఏమిటి? షూటింగ్ పూర్తయిందా? పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి? అనే సందేహాలు చాలాకాలంగా అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా నటుడు ప్రవీణ్ కుమార్ తాజాగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఆయన ఈ సినిమాలో భాగమనే విషయం మరోసారి స్పష్టమైంది. అంతేకాకుండా సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి హడావుడి లేకుండా చిత్రబృందం సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. ముఖ్యంగా డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనే విషయం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అందాల తార త్రిష కృష్ణన్ నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించడంతో 'విశ్వంభర'లో వీరి జంట ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్, అశికా రంగనాథ్, రమ్య పసుపులేటి, రుషా చాన్లా, ఆశ్రిత వేముగంటి సందూరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, భారీ తారాగణంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. 'బింబిసార' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ మల్లిడి.. ఇప్పుడు చిరంజీవితో 'విశ్వంభర' వంటి భారీ సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా అద్భుతమైన ప్రపంచం, మాయాజాలం, ఫాంటసీ అంశాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పాన్ ఇండియా హీరోగా శ్రీకాంత్ తనయుడు.. షూటింగ్ ప్రారంభం



పెళ్లిసందడి, భాంపియన్ మూవీస్‌తో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా. తాజాగా మరో మూవీకి సిద్ధమయ్యారు. రోషన్ హీరోగా భారీ సూపర్ హీరో అడ్వెంచరస్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్ బ్యానర్‌పై పాన్ ఇండియాస్థాయిలో అశోక వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించనున్నారు. తాజాగా ఈ భారీ అడ్వెంచరస్ మూవీ పూజా కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ రువెంట్‌కు శ్రీకాంత్ హాజరై ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టారు. ఈ చిత్రంలో రేఖా పాండే, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభం కానుంది.

ఆ ఆలోచనలు ఒత్తిడి పెంచాయి: మౌళి తనూజ్ ప్రశాంత్



"నా తొలి చిత్రం 'లిటిల్ హార్ట్స్' మంచి విజయం సాధించింది. కానీ ఆ విజయం నాలో ఒత్తిడి పెంచింది. ఆ సినిమా విజయం తర్వాత నేను చాలా కథలు విన్నాను. అయితే సరైన కథలనే ఎంచుకుంటున్నానా? నా జడ్జ్‌మెంట్ కరెక్టేనా? అనే ఆలోచనలు నాలో ఒత్తిడి పెంచాయి. అయితే నాకు కొత్త కథలు చెబుతూనే, ఎంటర్‌టైనింగ్ సినిమాలు చేయాలని ఉంది" అని మౌళి తనూజ్ ప్రశాంత్ అన్నారు. మౌళి తనూజ్ ప్రశాంత్, సుష్మితా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన బ్రైమ్ బామెడీ ఎంటర్‌టైనర్ సినిమా 'డీఎన్‌కే'. శ్రీను కంబాల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై సవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మౌళి తనూజ్ మాట్లాడుతూ-- "రుజీ మనీకి అలవాటు పడ్డ ఓ కుర్రాడు గ్యాంబ్లింగ్ చేస్తే డబ్బులు వస్తాయని ఆ మార్గాన్ని ఎంచుకుంటాడు. కానీ అతను తీసుకునే నిర్ణయాల వల్ల అప్పుల్లో కూరుకుపోతాడు. ఆ అప్పుల నుంచి బయటపడటానికి ఒక దొంగతనం చేస్తాడు. ఆ తర్వాత ఆ కుర్రాడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది? ఆ కష్టాల నుంచి ఎలా బయటపడ్డాడు? అన్నదే ఈ సినిమా కథ. కథలో క్రైమ్ ఎలిమెంట్ ఉన్నప్పటికీ మంచి ఫన్ కూడా ఉంది. సెకండాఫిలో ఒక సర్‌ప్రైజింగ్ సాంగ్ కూడా ఉంటుంది. సింజిత్ మంచి మ్యూ జిక్ ఇచ్చాడు. ఇక సన్సార్ వాళ్లు అభ్యంతరం చెప్పడంతో మా సినిమా ట్రైటిల్‌ను 'డీఎన్‌కే'గా మార్చాం. నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉంది. కానీ ఇది పెద్ద బాధ్యత కాబట్టి కాస్త సమయం పడుతుంది" అని అన్నారు.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.